

సోమశిలలో 65.320 టీఎంసీల నీరు

అనంతసాగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం 19,559 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 65.320 టీఎంసీలు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తర కాలువకు 300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరిస్తాం

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ● పోర్టు సీఈవోతో చర్చలు

ముత్తుకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అదానీ కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ పునరుద్ధరించి తీరుతామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన బీజేపీ, జనసేన, సీపీఎం, సీపీఐ, ఇతర పార్టీల నేతలతో కలిసి పోర్టు సీఈవో జగదీష్ పటేల్‌ను కలిసి చర్చలు జరిపారు. అనంతరం మాట్లాడుతూ వేలాది ఎకరాలను త్యాగం చేసి కృష్ణపట్నం పోర్టు అభివృద్ధికి సహకరించిన స్థానికులపై బొగ్గు బూడిద చల్లి, ఉపాధి అవకాశాలను కల్పించే కంటైనర్ టెర్మినల్‌ను తమిళనాడుకు తరలించడం దారుణమన్నారు. దేశంలోనే అత్యుత్తమ పోర్టుగా కృష్ణపట్నం పోర్టు నిలవడంతో కీలకపాత్ర పోషించిన కంటైనర్ టెర్మినల్‌ను కాటుపల్లి, ఎన్నూరు పోర్టులకు తరలించడం సరికాదని ఆయన అన్నారు. ఒకవైపు పరిశ్రమల స్థాపనతో ఉపాధి అవకాశాలను పెంపొందించే క్రిష్ సిటీ ప్రారంభోత్సవానికి వస్తున్న ప్రధానికి, ఉపాధి కల్పించే కంటైనర్ టెర్మినల్‌ను మూసివేశామని చెబుతూ అదానీ యాజమాన్యం ఆహ్వానం పలుకుతారా ? అని ప్రశ్నించారు. కృష్ణపట్నం పోర్టులో యథా ప్రకారం కంటైనర్ టెర్మినల్‌ని పునరుద్ధరించి, సేవలు కొనసాగించాలని సీఈవోని సోమిరెడ్డి కోరారు. తాను ఈ విషయాలన్నింటినీ అదానీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి కంటైనర్ టెర్మినల్ కొనసాగేలా చూస్తామని సీఈవో హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. పోర్టు యాజమాన్యం కంటైనర్ టెర్మినల్ కొనసాగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూసి భవిష్యత్తు కార్యక్రమం నిర్ణయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురేంద్ర, వెంకటేశ్వరరెడ్డి, బీజేపీ నాయకులు ఆంజనేయులురెడ్డి, రవీంద్రరెడ్డి, జనసేన నాయకులు సురేష్‌నాయుడు, సీపీఐ నాయకులు శంకర్, కిషోర్, సీపీఎం నాయకులు మోహన్‌రావు, శ్రీనివాసులు, స్థానిక నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, కోదండయ్య, తదితరులు పాల్గొన్నారు.

● పదివేల మంది పొట్టకొడతారా ?

లాభాలు ఆర్జించి పెట్టే కంటైనర్ టెర్మినల్‌ను పక్క రాష్ట్రానికి తరలించి, దానిపై ఆధారపడి జీవించే పదివేలమంది పొట్టకొడతారా.. ? అని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కంటైనర్ టెర్మినల్ ఇక్కడి నుంచి తరలిపోవడంతో వృత్తి నిపుణులు, పట్టభద్రుల నుంచి లారీ డ్రైవర్ల వరకు 10వేల మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. భూములు, గ్రామాలను ఈ ప్రాంత రైతులు త్యాగం చేస్తే మీరు కంటైనర్ టెర్మినల్ మూసేసి వారి పొట్టకొడతారా? అని మండిపడ్డారు. అవసరమైతే అదానీ కాళ్లు పట్టుకుంటాం.. లేదంటే పోరాటానికి దిగుతాం తప్ప, గత ప్రభుత్వంలో పాలకుల మాదిరిగా అబద్ధాలతో కాలయాపన చేయబోమన్నారు.

● మీడియాకు నో ఎంట్రీపై ఆగ్రహం

పోర్టులో చర్చల సందర్భంగా మీడియా వాహనాన్ని అనుమతించకపోవడంపై సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోర్టు యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడామని, మీడియా ప్రతినిధులు పరిపాలన భవనంలో వేచి ఉంటారని చెప్పినా, సెక్యూరిటీ డీజీఎం అడ్డుపడడంపై మండిపడ్డారు. వెంటనే మీడియా ప్రతినిధుల వాహనాన్ని పరిపాలన భవనం వద్దకు అనుమతించాలని సూచించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐలు శ్రీనివాసులురెడ్డి, విశ్వనాథ్‌రెడ్డిలు పోర్టు సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడి పక్కకు తీసుకెళ్లడంతో పరిస్థితి సద్దుమణిగింది.



పోర్టు సీఈవో జగదీష్ పటేల్‌తో మాట్లాడుతున్న సోమిరెడ్డి, తదితరులు

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా తయారైంది సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(సీఆర్‌ఎఫ్) రోడ్ల పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేకుండా మొత్తం నిధులను కేంద్ర ప్రభుత్వమే అందిస్తున్నా, జిల్లాలో కీలకమైన రోడ్లను అభివృద్ధి చేసుకోలేకపోతున్నారు. నాడు వైసీపీ నేతలు రోడ్లను భ్రష్టుపట్టించి పోగా, ఇప్పుడు కొందరు టీడీపీ నేతలు కూడా అదే దారిలో నడుస్తున్నారు. ఈ ధోరణి కేంద్ర ప్రభుత్వ వర్కులపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

● ప్రారంభం కాని రహదారుల రద్దుకు ప్రభుత్వం ఆదేశం ● 25 శాతంలోపు జరిగినవి కూడా ఈ జాబితాలోకే..!
● జిల్లాలో నాలుగు కీలక రోడ్లకు గండం ● వీటి విలువ రూ.120 కోట్లకు పైగానే..
● రాజకీయ నేతల జోక్యమే కారణం ● ఇప్పుడు హడావిడి చేస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

కేంద్రం ఇస్తున్నా చేయడానికి కష్టం

సీఆర్‌ఎఫ్ రోడ్లు రద్దు



ఇందుకూరుపేట మండలం నరసాపురంలో రోడ్డు విస్తరణలో భాగంగా మట్టిని ఊడ్చుతున్న యంత్రం

నెల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సీఆర్‌ఎఫ్ కింద ఏటా కొన్ని రోడ్లను మంజూరు చేస్తుంటారు. వాటిని ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుం టుంటే ఆ మరు సటి ఏడాది మరికొన్ని రోడ్లకు అనుమతులు వస్తుంటాయి. కానీ జిల్లా లో రెండేళ్ల క్రితం అనుమతులు ఇచ్చిన వర్కు లు ఇంతవరకూ మొదలు కాలేదు. ఈ నేపథ్యంలో కొత్త వర్కులు కేంద్రం నుంచి మంజూరు చేయించుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అసలు ప్రారంభం కానీ, 25 శాతం లోపు పనులు జరిగిన వర్కులను రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆ జాబితాను పంపాలంటూ జిల్లా ఆర్‌అండ్‌బీ శాఖకు ఉత్తర్వులు పంపింది. కీలకమైన నెల్లూరు-మైపాడు, నెల్లూరు-పొదలకూరు-సైదాపురం, గూడూరు-తురిమెర్ల, కలిగిరి-ఓబులేటి వారిపాలెం రోడ్లు ఇప్పుడు రద్దయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఈ నాలుగు రోడ్ల విలువ సుమారు రూ.120 కోట్లు ఉంటుంది. రాజకీయ నేతల జోక్యం లేకుండా ఉన్నా, ఆర్‌అండ్‌బీ అధికారులు నిబంధనల ప్రకారం నడుచుకొని ఉన్నా ఈ పాటికి ఈ వర్కులు 50 శాతం పనులు జరిగి ఉండేవి. రద్దయ్యే అవకాశం ఉండేది కాదు.

[illegible] అంటే!

జిల్లా పర్యాటకాభివృద్ధిలో నెల్లూరు-మైపాడు రోడ్డు చాలా కీలకమైంది. ఈ రోడ్డును విస్తరించి అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సీఆర్‌ఎఫ్ కింద రూ.48 కోట్లు మంజూరు చేసింది. ఏడాది క్రితం ఈ రోడ్డుకు టెండర్ పిలిచారు. అయితే మూడు రోజుల క్రితం వరకూ పనులు మొదలు కాలేదు. టెండర్ల సమయం నుంచే ఈ రోడ్డుకు గ్రహణం పట్టింది. నాడు ఐదు గురు కాంట్రాక్టర్లు టెండర్లు వేసి అంతా రింగ్ అయ్యి ఎక్సెస్‌కు దక్కించుకున్నారు. అందరూ తలా కొద్దిగా పని చేసేలా అనధికార ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకు నాటి వైసీపీ నేతలు మధ్యవర్తిత్వం చేశారు. అయినా రాజకీయ కారణాలతో వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు పనులు మొదలుపెట్టలేదు. ఇక కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఈ రోడ్డుకు రాజకీయ గ్రహణం వీడలేదు. కోవూరులో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ కాంట్రాక్టర్ ఈ రోడ్డు పని మొత్తాన్ని దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. 'ఆంధ్రజ్యోతి' కథనాలతో ఈ ప్రయత్నాలకు బ్రేకులు పడ్డాయి. ఎట్టకేలకు రెండు వారాల క్రితం కోవూరు ఎమ్మెల్యే ఈ వర్కుకు శంకుస్థాపన చేశారు. ఇన్ని రోజులు పనులు మొదలుపెట్టకపోవడంపై ప్రశాంతిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ప్రారంభం కాని సీఆర్‌ఎఫ్ వర్కులు రద్దు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత

(మిగతా 6వ పేజీలో)

ఆత్మకూరు పూర్వ ఆర్డీవోపై చార్జస్ ఫ్రేమ్

● పది రోజుల్లో వివరణ ఇవ్వాలని ఉమాదేవికి ఆదేశం

నెల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పూర్వ ఆర్డీవో పీ ఉమాదేవిపై చార్జస్ ఫ్రేమ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో విడుదల చేసింది. ఆత్మకూరులో పనిచేసిన సమయంలో ఆమె పలు అవకతవకలకు పాల్పడ్డారని ఏసీబీ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. పది రోజుల్లో రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని, లేనిపక్షంలో అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొంది. 2019-20 సంవత్సరాల్లో ఆత్మకూరు ఆర్డీవోగా ఉమాదేవి పనిచేశారు. ఆ సమయంలో ఓ వ్యక్తి తాను ఏసీబీ అధికారినంటూ, రూ.లక్ష ఇవ్వాలంటూ ఆర్డీవోను బెదిరించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు తెలియజేయాల్సి ఉండగా, ఉమాదేవి ఆ పనిచేయకుండా, రూ.25 వేలను సదరు నకిలీ ఏసీబీ అధికారి అకౌంట్‌కు జమ చేశారు. ఇది మొదటి తప్పుగా ఏసీబీ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. అలానే ఉన్నతాధికారుల ఉత్తర్వులు లేకుండా ఓ రిటైర్డ్ తహసీల్దార్‌ను నియమించుకొని ఆర్డీవో కార్యాలయంలో పనిచేయించుకుంటున్నారు. ఈ విషయం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీల్లో వెలుగు చూసింది. దీనిపై కూడా చార్జస్ ఫ్రేమ్ చేశారు. లేట్ డెత్, లేట్ బర్త్ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో కూడా ఉమాదేవి నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగానూ చార్జస్ ఫ్రేమ్ చేశారు.

విత్తన దుకాణాల తనిఖీ

60 దుకాణాల్లో 47 నమూనాల సేకరణ
నాణ్యత లేకపోతే చర్యలు : డీఏవో

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సోమవారం విత్తన విక్రయ దుకాణాల్లో ముమ్మరంగా తనిఖీలు సాగాయి. పలు ప్రాంతాల్లో విత్తనాలు మొలకెత్తలేదన్న విమర్శలు రావడంతో జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఆదేశాల మేరకు, మండల వ్యవసాయాధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు. విత్తన నాణ్యత రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్‌లతోపాటు కొనుగోలు చేసిన రైతుల వివరాలు, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. మొలకశాతం 80శాతం కంటే ఎక్కువగా ఉన్న నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని, ప్రతి లాట్‌లో విత్తనాల మొలకశాతాన్ని పరీక్షించాలని వ్యాపారులకు సూచించారు. సుమారుగా 60 దుకాణాల్లో తనిఖీలు చేపట్టి, 47 విత్తన నమూనాలను సేకరించారు. వీటి నాణ్యతను పరిశీలించేందుకు ఆయా నమూనాలను ప్రయోగశాలలకు పంపించనున్నారు. విత్తనాల్లో నాణ్యత లేదని ధ్రువీకరణ జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఏవో సత్యవాణి దుకాణాల నిర్వాహకులు, డీలర్లను హెచ్చరించారు. అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని రైతులకు సూచించారు. ఆబిల్లును, విత్తనాల సంచులను పంట సీజను ముగిసే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. నారు పోయకముందే 100 విత్తనాల మొలక శాతాన్ని పరిశీలించాలన్నారు.

● విత్తనాల కొరత లేదు

రబీ సీజన్‌కు జిల్లాలో విత్తన కొరత లేదని డీఏవో తెలిపారు. జిల్లాలో ఎక్కువగా సాగు చేసే వరి విత్తనాలైన బీపీటీ -5204 3వేల క్వింటాళ్లు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఆర్‌ఎన్‌ఆర్-15048 రకం 7500 క్వింటాళ్లు, కేఎన్ఎం-1638 రకం 8700 క్వింటాళ్లు, ఎన్ఎల్ఆర్-34449 రకం 1660 క్వింటాళ్లు, ఇతర రకాలు మరో 2500 క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉన్నాయని ఆమె వివరించారు.



ఊరంతా చదువుకున్నోళ్లే !

ఆ ఊరిలో అంతా చదువుకున్నోళ్లే... ఎంతలా అంటే ప్రతి పది ఇళ్లలో ఓ ఉద్యోగి ఉండేలా.. అంతేకాదండోయ్.. ఆ గ్రామం నెల్లూరు రూరల్ మండలంలోనే అతి పెద్దదట. ఆ పల్లెలో చదుకున్నవారంతా వ్యవసాయం కూడా చేస్తారట. ఇది మరీ ఆశ్చర్యం...! ఇక్కడ రైతులు, రైతు కూలీలు, చేనేత కార్మికుల సంఖ్య కూడా ఎక్కువేమరి. నాటి తరం సినీనటి వాణిశ్రీని ఆ ఊర్లోళ్ల అడగ్గానే హైస్కూలు పెట్టించిదట. ఆ ఊరే సౌత్‌మోపూరు.

6లో..

డీఆర్వో బాధ్యతల స్వీకరణ

నెల్లూరు హరనాథపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)గా ఉదయభాస్కర్‌రావు సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఆయన పశ్చిమ గోదావరిలో డీఆర్వోగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. నెల్లూరులో డీఆర్వోగా పనిచేస్తున్న లవన్న జీఏడీలో రిపోర్టు చేశారు. బాధ్యతలు చేపట్టిన డీఆర్వోకి కలెక్టరేట్ ఏవో పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ

● యంత్రాలతో బయట ప్రాంతాల్లో డంపింగ్ ● రాత్రికిరాత్రే లారీల్లో అక్రమ రవాణా

కలువాయి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నాబద్వేలు సమీపంలోని పెన్నానది ఒడ్డున ఉన్న భూముల నుంచి భారీగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఎక్స్‌కవేటర్‌తో ట్రాక్టర్లకు ఇసుక లోడ్ చేసి బయటకు తరలించి పెద్ద ఎత్తున డంప్ చేస్తున్నారు. అక్కడ నుంచి రాత్రికిరాత్రే లారీలకు లోడ్ చేసి అక్రమ రవాణా చేస్తున్నారు. కొందరు అక్రమార్కులు వారం రోజులుగా ఈ వ్యవహారం సాగిస్తున్నారు. మండల పరిధిలో రాజుపాళెం నుంచి తెలుగురాయపురం వరకు సుమారు 20 కిలోమీటర్ల దూరం పెన్నానది ఉంది. గతంలో కొందరు పెన్నా పరివాహక ప్రాంతం నుంచి రాత్రిళ్లు ఒకట్రెండుచోట్ల మనుషులతో ట్రాక్టర్లుకు ఇసుక లోడ్ చేసుకుని లోకల్‌గానే అమ్ముకుని జేబులు నింపుకునేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టాక లోకల్‌గా ఇసుకకు డిమాండ్ తగ్గిపోవడంతో బయటకు ప్రాంతాల కు లారీలతో తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.



కలువాయి : ట్రాక్టర్‌కు ఇసుక లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

రీచ్‌లోకి యంత్రాలు దించితే సీజ్ : నారాయణ



నెల్లూరు (వెంకటేశ్వరపురం) అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని భగత్‌సింగ్‌కాలనీ, బోడిగాడితోట, గాంధీ గిరిజనకాలనీ, పొర్లుకట్ట, పొట్టేపాళెం, దీన్‌దయాళ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ట్రాక్టర్ ఎక్కి ఇసుక లోడింగ్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పెన్నాలోని రీచ్‌ల్లోకి ఎట్టి పరిస్థితుల్లో యంత్రాలను దించరాదని ఆదేశించారు. అలా ఎవరైనా చేస్తే వెంటనే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. నగరంలో నాలుగు రీచ్‌లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడా కూడా ఇసుక అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా పోలీసులు గట్టి నిఘా పెట్టాలని ఆదేశించారు. మంత్రి వెంట టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసు లరెడ్డి, కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, నారాయ ణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, విజేత రెడ్డి తదితరులు ఉన్నారు.

● బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిబంధనలు బేఖాతర్
● నగరంలోని ప్రధాన కూడళ్లలోనే ఏర్పాటు
● లాటరీ పూర్తికాక ముందే విక్రయాలు
● రాజకీయ నేతల హామీతో ఇష్టానుసారం
● లబోదిబోమంటున్న లైసెన్సుదారులు

అడిగేదెవరు...? అంతా మా ఇష్టం !



మినీ బైపాస్‌లోని జీపీఆర్ కల్యాణ మండపం వద్ద అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి వస్తుందంటే రెవెన్యూ, ఫైర్, పోలీసు శాఖల సమన్వయంతో లైసెన్సులు మంజూరు చేసి, లక్కీడిప్ ద్వారా దుకాణాలను కేటాయిస్తారు. దుకాణాలు ఏర్పాటుచేసే ప్రాంతంలోనూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. అయితే నిబంధనలు గాలికి వదిలి.. అంతా మా ఇష్టం అంటూ జిల్లావ్యాప్తంగా అనధికార టపాసుల దుకాణాలను ఏర్పాటు చేశారు. నెల్లూరులో ఆర్డీవో సమక్షంలో లాటరీ తీసి, దుకాణాలు కేటాయించకముందే సోమవారం మధ్యాహ్నం నుంచే అంగళ్లు ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించారు.

● ముందే ఏర్పాటు

దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న కొందరు వ్యాపారులు రాజకీయ నేతల అండతో దుకాణాలకు లక్కీడిప్ నిర్వహించకముందే ఆదివారం నుంచి ప్రధాన కూడళ్లలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు టెంట్లు సిద్ధం చేసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచే విక్రయాలు సాగించారు. ఈ విషయమై కొందరు పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు ప్రశ్నిస్తే తాత్కాలిక లైసెన్సు ఉందికదా ..? మిగిలిన విషయాలు మా నాయకుడు చూసుకుంటాడులే.. అంటూ సమాధానమిచ్చారు.

● సాధారణ వ్యాపారులు లబోదిబో

అధికారులు అడిగిన అన్నీ పత్రాలు సమర్పించి, లక్కీడిప్‌లో దుకాణాలు పొందిన సాధారణ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన కూడళ్లలో దుకాణాలు ఏర్పాటు చేయడాన్ని చూసి

(మిగతా 6వ పేజీలో)

ఉద్యోగుల ఊరు.. సౌత్‌మోపూరు

ఆ ఊరిలో ఒకరిద్దరు కాదు.... ఏకంగా 80 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. విదేశాల్లో 30 మంది, సాఫ్ట్‌వేర్ రంగల్లో 60 మంది, ప్రైవేట్ రంగ సంస్థల్లో వందకు పైగానే ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిందరి విద్యకు గ్రామంలోని వాణిశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ పునాదులు వేయగా, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నతవిద్యకు చేయూతనందించింది. ఆ ఊరే నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు. వ్యవసాయ, చేనేత రంగాలకు ప్రసిద్ధిగాంచిన ఈ ఊరు మండలంలోనే అతిపెద్దది. 1300 కుటుంబాలు ఉన్న గ్రామంలో ప్రతి ఇంట్లోనూ చదువుకున్నవారు, ప్రతి పది ఇళ్లలోనూ ఒకరు ఉద్యోగిగా ఉండటం గమనార్హం.



మరో కోణం

- గ్రామంలో 80 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు
- సాఫ్ట్‌వేర్ రంగంలో మరో 60 మంది
- వందమందికిపైగా ప్రైవేటు సంస్థల్లో పనిచేసేవారు
- విదేశాల్లోనూ 30 మందికి కొలువులు
- విద్యకు జీవం పోస్తున్న 'వాణిశ్రీ' హైస్కూల్
- ఉన్నత విద్యకు జూ. కళాశాల చేయూత



ఉద్యోగులెక్కువ...

మా ఊళ్లో ఉద్యోగులు ఎక్కువ. గ్రామంలోనే హైస్కూల్, కాలేజీలు న్నాయి. ప్రతి ఇంట్లో పిల్లలు బడికి వెళ్తారు. ఇక్కడ చదువులు అయిపోయాక బయట చదువుకుని ఉద్యోగాలు తెచ్చుకుంటున్నారు. ఇది చాలా సంతోషం.

- తిరువీధుల పోలయ్య, సర్పంచి



అమెరికాలో టీచర్‌గా చేస్తున్నా

మా ఊరి హైస్కూల్లో పది తరగతి వరకు చదువుకుని, బయట ప్రభుత్వ సంస్థల్లోనే చదువు పూర్తి చేశా. అనంతరం అమెరికాకు వెళ్లి టీచర్‌గానే కొనసాగుతున్నా. మా ఊరికి హైస్కూల్ గుండెకాయలాంటిది. నాలాగా ఎందరికో ఓనమాలు నేర్పి ఉద్యోగులుగా తీర్చిదిద్దింది.

- పముజుల పద్మ



ఇంతమంది ఉద్యోగులు ఏ ఊళ్లో లేరు

ఓ గ్రామంలో ఇంతమంది ఉద్యోగులు బహుశా ఎక్కడా ఉండరేమో. ఈ విషయాన్ని మేము బయట ఎక్కడైనా చెప్పుకోవాలన్న ఎంతో గర్వంగా ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి మా ఊర్లో పోటీ పడతారు.

- తాళ్ల శ్రీనివాసులు, ప్రభుత్వ టీచర్



పెద్ద వాళ్ల కృషే జీవితాలను మార్చింది

అప్పట్లో గ్రామానికి చదువు ఉండాలని, హైస్కూల్ తీసుకువచ్చారు. పైగా వాణిశ్రీ లాంటి సినీనటి స్వయంగా ఆర్థిక చేయూతనివ్వడం మాలాంటి ఉద్యోగుల జీవితాలకు జీవం పోసింది. అప్పుడు పెద్దోళ్ల కృషి చేయకపోతే చదువుకు అనేది ఉండేది కాదు.

- చప్పరం వెంకటేష్, సచివాలయ ఉద్యోగి

సౌత్ మోపూరులో 1967వ సంవత్సరంలో ప్రముఖ సినీ నటి వాణిశ్రీ ఆర్థిక సాయంతో గ్రామం నడిబోడ్డున జడ్పీ హైస్కూల్‌ను ఏర్పాటు చేశారు. 2008లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్థాపించారు. ఎందరికో ఇవి అక్షరజ్ఞానం ఇచ్చాయి. ఈ రెండు విద్యా సంస్థల్లో చదివినవారు 80 మంది వరకు రెవెన్యూ, పోలీసు, వైద్యం, విద్య, ఆర్టీసీ, సచివాలయాలు, అంగన్‌వాడీ శాఖల్లో అధికారులు, ఉద్యోగులుగా పని చేస్తున్నారు. మరో 30 మంది వరకు విదేశాలలో ఉద్యోగులుగా కొనసాగుతున్నారు. 60 మంది ప్రముఖ నగరాల్లో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి పొందుతున్నారు. ఇక ప్రైవేట్ సంస్థల్లో వంద మందికి పైగానే వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. విదేశాల్లోనూ ఒకే గ్రామం నుంచి ఏకంగా 30 మంది వరకు ఉద్యోగాలు పొందడం విశేషం. 1981-82లో పది పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉతీర్ణత సాధించి అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకున్న గ్రామం ఇది.

● వ్యవసాయ, చేనేత రంగాల్లో ఖ్యాతి

జిల్లాలో వ్యవ సాయ, చేనేత రంగాల్లో ఖ్యాతి గడించిన ఈ గ్రామంలో



రైతు, రైతుకూలీలు, కౌలురైతులు, నేత కార్మికులు ఎక్కువగా ఉన్నారు. 11 గ్రామాలకు విద్యా వనరులు కలిగిన ఈ ఊరు రవాణా సౌకర్యంలోనూ అనుకూలమైంది. ముప్పాతికశాతం మంది ఇక్కడ చదువులకు ప్రాధాన్యం ఇస్తుండగా, అతి తక్కువమంది మాత్రమే బయట ప్రాంతాలకు వెళ్తుంటారు. ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న పలువురు గ్రామస్థులు తమ పొలాల్లో పనులు చేసుకుంటుండటం ఇక్కడి ప్రత్యేకత.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)

● విద్యకు జీవం పోసిన వాణిశ్రీ

ఈ గ్రామంతో సినీ నటి వాణిశ్రీకి ఎలాంటి సంబంధం లేకపోయినా గ్రామస్థుల విజ్ఞప్తిని, చదువుకు చేయూతనివ్వాలన్న సంకల్పంతో హైస్కూల్‌ను ఏర్పాటు చేశారు. ఆమె చెన్నైలో ఉన్నా నెల్లూరు నుంచి ఆమెను కలిసేందుకు ఎవరొచ్చినా సౌత్‌మోపూరులోని తన పేరున ఉన్న హైస్కూల్ బాగోగులు అడగటం ఆమెకు అలవాటుగా మారింది. ఇటీవల మండలంలోని కాకుపల్లికి వచ్చిన సందర్భంగా ఆమె హైస్కూల్ ఏర్పాటు గురించి భావోద్వేగంతో మాట్లాడారు.

సీఆర్‌ఎఫ్ రోడ్లు రద్దు

(5వ పేజీ తరువాయి)

మూడు రోజుల క్రితం నెల్లూరు-మైపాడు రోడ్డు పనులు మొదలుపెట్టడం గమనార్హం. అలాగే గూడూరు-తురిమెర్ల రోడ్డు కూడా దారుణంగా దెబ్బతింది. ఏడాదన్నర క్రితం సుమారు రూ.28 కోట్లతో ఈ రోడ్డుకు టెండర్లు పూర్తి చేశారు. నాడు 'ఆంధ్రజ్యోతి' కథనాలతో కాంట్రాక్టర్ల రింగ్ ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఈ వర్కు ఏకంగా 18 శాతానికి పైగా లెస్‌కు వెళ్లడం విశేషం. రెండేళ్లలో పూర్తి కావలసిన ఈ రోడ్డు పనులు ఇప్పటికి సుమారు పదిహేను శాతం జరిగినట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. భారీ లెస్ కావడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ఆసక్తి చూపడం లేదని చెప్పుకుంటున్నారు. అయితే నెల్లూరు-మైపాడు రోడ్డు, గూడూరు-తురిమెర్ల రోడ్లు రెండింటినీ ఒకే కాంట్రాక్టర్ దక్కించుకోవడం గమనార్హం.

● బిల్లుల సమస్యతో బ్రేకులు

నెల్లూరు - పొదలకూరు - సైదాపురం (ఎన్‌పీఎస్) రోడ్డుకు, కలిగిరి-ఓబులేటివారి పాలెం రోడ్లకు కూడా ఏడాదిక్రితం టెండర్లు పూర్తి చేశారు. కీలకమైన ఈ రోడ్లను విస్తరించి అభివృద్ధి చేయాల్సి ఉంది. నిబంధనల ప్రకారం రెండేళ్లలో ఈ రోడ్లు పూర్తి కావాల్సి ఉండగా, ఇప్పటికి 25 శాతం కూడా పూర్తి కాలేదు. ఈ రెండు రోడ్లలో కాంట్రాక్టర్లు కొంత మేర మాత్రమే పనులు చేశారు. ఆ తర్వాత పనులు నిలిపేశారు. వీరికి ఇతర వర్కుల్లో ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతోనే ఇక్కడ పనులు చేయలేదని ఆర్ అండ్‌బీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. అయితే వీరిచేత పనులు చేయించడంలో ఆర్అండ్‌బీ అధికారులు విఫలమయ్యారు. తీరా 25 శాతం లోపు పనులు జరిగిన వర్కులు రద్దు చేయాలని ఉత్తర్వులు వచ్చాక హడావుడి చేయడం ప్రారంభించారు. ఎలాగైనా 25 శాతం పనులు జరిగినట్లు చూపించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఇప్పటికిప్పుడు అంత పనులు చేయడం సాధ్యం కాకపోతుండడంతో తలలు పట్టుకుంటున్నారు. పనులు పూర్తికాకుండానే 25 శాతం జరిగినట్లు రిపోర్టు పంపాలని కొందరు కాంట్రాక్టర్లు కూడా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాకనే ఈ రోడ్ల స్టేటస్ మొత్తాన్ని ఇదే అధికారులు ప్రభుత్వానికి పంపారు. అటువంటిది ఈ లోపు 25 శాతం పనులు పూర్తయ్యాయని నివేదిక ఇస్తే తాము ఇరుక్కుంటామని కొందరు భయపడుతున్నారు. రాజకీయ నేతల జోక్యమో ? లేక అధికారుల నిర్లక్ష్యమో.. ఏదేమైనా గానీ ఇప్పుడు సుమారు రూ.120 కోట్ల పనులు రద్దయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఇది జిల్లా ప్రజలకు తీరని నష్టాన్ని మిగులుస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● పనుల రద్దు వాస్తవమే..

ఈ వ్యవహారంపై ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధరను వివరణ కోరగా ప్రారంభం కాని సీఆర్ఎఫ్ పనుల రద్దుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన మాట వాస్తవమేనని చెప్పారు. అయితే ఈ జాబితాలోకి వచ్చే రోడ్ల వివరాలు ఇంకా సిద్ధం చేయలేదని ఆయన పేర్కొన్నారు.

టపాసుల దుకాణాల కోసం పోటీ

- నెల్లూరులో ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు
- డిప్ తీసి కేటాయింపు.. వ్యాపారుల ఆందోళన
- ఉద్రిక్తత.. పోలీసుల రంగ ప్రవేశం

నెల్లూరు వెంకటేశ్వరపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో టపాసుల దుకాణాల కేటాయింపు వ్యాపారుల ఆందోళనకు దారితీసింది. ప్రతిఏటా నగరంలో వీఆర్‌సీ, వైఎంసీ, ఆర్ఎస్ఆర్ స్కూలు మైదానాల్లో దుకాణాలను ఏర్పాటు చేస్తారు. ఈసారి వీటితోపాటు సర్వోదయ, ఎస్‌వీజీఎస్ కళాశాల మైదానాల్లో కూడా దుకాణాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎక్కువ మంది వ్యాపారులు వీఆర్‌సీ మైదానంలో దుకాణాల ఏర్పాటుకు పోటీ పడ్డారు. ఇక్కడ 46 దుకాణాలు ఏర్పాటుకు అవకాశం ఉండగా, 66 మంది దరఖాస్తు చేశారు. ఇక్కడే



ఆర్డీవో సమక్షంలో లాటరీ తీస్తున్న టపాసుల దుకాణదారులు



ఆందోళన చేస్తున్న వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

చిక్కు వచ్చింది. ఆర్డీవో అనూష 66 మందికి డిప్ తీసి దుకాణాలు కేటాయిస్తామన్నారు. అయితే కొత్తగా వచ్చిన వ్యాపారులకు ఎలా డిప్ తీసి కేటాయిస్తారని పాత వ్యాపారులు ఆందోళన చేపట్టారు. దీంతో ఆర్డీవో కార్యాలయం వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకొన్న సంతపేట సీఐ శ్రీనివాసులు, సిబ్బందితో అక్కడికి వచ్చారు. వ్యాపారులతో మాట్లాడి ఆందోళనను విరమింపచేశారు. ఎట్టకేలకు పాత వ్యాపారులకే డిప్ తీసి దుకాణాలు కేటాయించారు. మిగతా వారికి ఎస్‌వీజీఎస్ కళాశాల మైదానంలో కేటాయిస్తామన్నారు. కాగా మిగతా నాలుగు ప్రాంతాల్లో దుకాణాల కేటాయింపు ప్రశాంతంగా సాగింది. నెల్లూరు నగరంలోని వీఆర్‌సీలో 46, ఆర్ఎస్ఆర్‌లో 28, వైఎంసీఏ లో 19, ఎస్‌వీజీఎస్‌లో 20, సర్వోదయలో 10 దుకాణాలతో కలసి మొత్తం 123 దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు.

అడిగేదెవరు..? అంతా మా ఇష్టం !

(5వ పేజీ తరువాయి)

ఇదెక్కడి న్యాయం..? కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమేగా దుకాణాలు ఏర్పాటు చేయాలి.. ఇలా ఏర్పాటు చేస్తే మేం నష్టపోతాం కదా...? అంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా నేతల ఒత్తిళ్లతో అలాంటి దుకాణాల జోలికి ఎవరూ వెళ్లలేదు. కాగా ఎవరికి కేటాయించిన ప్రాంతాల్లో వారే దుకాణాలు ఏర్పాటు చేయాలి. నిబంధనలు అతిక్రమించి, ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

వలేటివారిపాలె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న లారీ మోటారు బైకును ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన సోమవారం రాత్రి 9 గంటల సమయంలో వలేటివారిపాలెం-చుండి గ్రామాల మధ్య జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఈ వివరాలు ఇలా ఉన్నాయి. అయ్యవారిపల్లెకు చెందిన బచ్చు పృథ్వీరాజ్ (30) వలేటివారిపాలెం నుండి మోటారుబైకుపై అయ్యవారిపల్లె వెళుతుండగా పామూరు నుండి కందుకూరు వైపు వెళ్తున్న లారీ ఢీనడంతో తలకు తీవ్ర గాయం కావడంతో రక్తస్రావం అవడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, భార్యపిల్లలు బోరున విలపిస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ మరిదినాయుడు మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి

- మెల్‌బోర్న్ యూనివర్సిటీ సీఈవో రాఖెల్‌ప్రాఫ్

నెల్లూరు(విద్య), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : నేటి పోటీ ప్రపంచంలో యువత ఉద్యోగాలు పొందే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని మెల్‌బోర్న్ యూనివర్సిటీ సీఈవో రాఖెల్‌స్రాఫ్ తెలిపారు. నగరంలోని డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం వికసిత భారత్, స్వర్ణాంధ్ర-2047 సాధనలో భాగంగా మెల్‌బోర్న్ కెరీర్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తాము నేర్చుకుంటున్న విద్య ఉద్యోగం సాధించడానికే కాకుండా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడాలన్నారు. తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవడంతో పాటు లక్ష్యాన్ని నిర్ధారించుకుని దాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు.



విద్యార్థినులు, అధ్యాపకులతో మాట్లాడుతున్న రాఖెల్‌స్రాఫ్

భారతదేశంలో ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని, విద్యార్థులు దీన్ని సక్రమమైన రీతిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవకాశాలను అందిపుచ్చుకుంటేనే ఉన్నతంగా ఎదగవచ్చని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకుండా విద్యా విధానాలను అనుసరించాలని తెలిపారు. అనంతరం కళాశాలలో ఫొటో ఎగ్జిబిషన్‌ను, హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో, సిబ్బందితో పలు విషయాలను చర్చించారు. కార్యక్రమంలో ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు, డీవీఈవో కే మధుబాబు, కేపీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, ఆత్మకూరు ప్రిన్సిపాల్ వాణిశ్రీ, కెరీర్ గైడెన్స్ ట్రైనర్ అనూష, షేక్.గౌస్‌బాషా, సురేష్, ప్రతిమా ప్రియదర్శిని, సిబ్బంది పాల్గొన్నారు.

పదం పాడుతూ పాదం కదుపుతూ!

కోలాటంతో ఆరోగ్యం, ఆధ్యాత్మిక సేవ

పదం పాడుతూ.. పాదాలు కలుపుతూ.. ఒకే రీతిన ఆడుతూ.. కోలాటం ప్రదర్శిస్తున్నారు సంగం గ్రామానికి చెందిన మహిళలు. ఇటు ఆరోగ్యం.. ఆనందం... అటు ఆధ్యాత్మికసేవలో తరిస్తున్నారు. వివిధ ఆలయాల్లోనూ, పుణ్యక్షేత్రాల్లోనూ భక్తితో ప్రదర్శనలు ఇస్తున్నారు. పండుగలు, ఇతర వేడుకల్లోనూ తమ ప్రత్యేకతను చాటుతున్నారు. నగర సంకీర్తనలో తమ గానాలాపనతో భాగస్వాములవుతున్నారు.



జానపద కళలపై ఉన్న ఆసక్తితో గ్రామానికి చెందిన పలువురు మహిళలు భజన మండలిని స్థాపించారు. ప్రత్యేకంగా కోలాటంలో శిక్షణ తీసుకున్నారు. శ్రీవేంకటేశ్వర కోలాట భజన మండలి పేరుతో 40మంది సభ్యులు ఎనిమిదేళ్ల నుంచి కోలాట ప్రదర్శనలు ఇస్తున్నారు.పండుగల్లోనే కాక శ్రావణ, కార్తీకమాసాల్లో ఆలయాల్లో జరిగే ఉత్సవాల్లో కోలాటం ఆడుతున్నారు. ఇటు ఆరోగ్యం.. వినోదంతోపాటు అటు ఆధ్యాత్మికసేవ చేస్తూ ప్రజల మన్నలు పొందుతున్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరికొంతమంది పెద్దలు వారిళ్లలో ఉండే చిన్నారులకు కోలాటంలో శిక్షణ ఇప్పిస్తున్నారు. పట్టణంలో జరిగే ఆధ్మాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బృందం సభ్యుల్లోనే కొందరు వాయిద్య బృందాన్ని సమన్వయం చేసుకుంటూ పాటలు, కీర్తనలు కూడా చక్కగా అలపిస్తున్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే...



కోలాటం నేర్చుకోవడంలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో ఉంది. ప్రసిద్ధ ఆలయాల్లో కోలాట ప్రదర్శన ద్వారా స్వామి వారిని అతిదగ్గరగా వెళ్లి దర్శించుకునే అవకాశం లభిస్తున్నది. ఉచితంగా ఆలయాల్లో ప్రదర్శనలిస్తున్నాం. కోలాటం పురాతన కళ అయినందున, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉంది.

- సుప్రజ, సంగం

వయసుతో పనిలేదు



నేను కోలాటం నేర్చుకోవడానికి మూడు నెలలు పట్టింది. కోలాటం ఆడుతుంటే ఆధ్యాత్మికతతోపాటు మనస్సుకు చాలా ఉల్లాసంగా ఉంటుంది. బృందాలుగా ఏర్పడి కోలాటం ఆడటం వల్ల సమైక్యత కూడా పెరుగు తుంది. ఈ కళపై ఆసక్తి ఉంటే నేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదు. మా బృందంలో అన్ని వయస్సుల వారు ఉన్నారు.

- పెంచలలక్ష్మి, సంగం

తనయే తనయుడై..



టీడీపీ సీనియర్ నాయకుడు నిక్కుదల నాగేశ్వరరావు బ్రెయిన్ హెమరేజ్‌తో చెన్నైలోని వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆయన కుమార్తె జగదీశ్వరి (సుమ) అమెరికాలో ఎంఎస్ చదువుతున్నారు. తండ్రి అనారోగ్యం సమాచారాన్ని ముందుగానే అందుకున్న ఆమె కోవూరుకు చేరుకున్నారు. మృతదేహానికి ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఐదేళ్ల తమ్ముడు గీతాన్స్ ఉన్నా పెద్ద కుమార్తెగా జగదీశ్వరి (సుమ) అంత్యక్రియలు నిర్వహించారు. శ్మశానవాటికలో ఆమె శాస్త్రోక్తంగా తండ్రి చితికి నిప్పుపెట్టారు. అంత్యక్రియల్లో పెద్దసంఖ్యలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు. మృతుడు నిక్కుదల నాగేశ్వరరావు కొంతకాలం కోవూరు సహకార చక్కెర కర్మాగారంలో పనిచేశారు. టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందించడమే కాకుండా సొంత నిధులతో మెరుగైన వైద్యసహాయం అందించారు. వీలుగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వాహనాన్ని ఏర్పాటు చేసి చెన్నైకి పట్టుపట్టి పంపించారు. చికిత్స పొందుతూ ఆయనకు మృతి చెందారు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)

నీరు సాఫీగా సాగేలా..!

సంగం మండలంలోని దువ్వూరు కాలువలో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ కాలువ కింద అధికారికంగా రెండువేలు, అనధికారికంగా మరో రెండువేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ కాలువను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో గుర్రపుడెక్క, తుంగతో పూడిపోయి పంట పొలాలకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని మలిదేవి డ్రైన్ పూడికతీతలో నిధులు మిగిలి ఉండడంతో ఇరిగేషన్ ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్‌తో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వయంగా మాట్లాడి మండలంలోని అన్ని పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టేలా ఆదేశాలిచ్చారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)





ప్రముఖ పర్యాటక శైవక్షేత్రం భైరవకోనలో సోమవారం భక్తులు సందడి చేశారు. జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లాల నుంచి పర్యాటకులు ఉదయం నుంచే ప్రత్యేక వాహనాలలో భైరవకోన చేరుకుని జలపాతం వద్ద స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. భక్తులు కాలభైరవున్ని, శివలింగాలను, త్రిముఖదుర్గాంబాదేవిని దర్శించుకుని పూజలు చేశారు.

- సీతారామపురం (ఆంధ్రజ్యోతి)

భైరవకోనలో సందడి

బాణసంచా కేంద్రాలపై స్పెషల్ డ్రైవ్

● జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్‌ల పరిధిలోని బాణసంచా తయారీ కేంద్రాలు, నిల్వ కేంద్రాలు, దుకాణాలపై పోలీసులు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జీ కృష్ణ కాంత్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్వాహకులు ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలు, జాగ్రత్తలు తప్పక పాటించాలని, అతిక్రమించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఇతర ప్రదేశాల్లో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. లైసెన్సులు కలిగిన దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయాలు చేయాలని, నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లాలో బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వల సమాచారాన్ని, అవాంచనీయ సంఘటనలు జరిగినా, సహాయం అవసరమైనా ఫైర్ స్టేషన్ 101, డయల్ 112లకు తెలియజేయాలని సూచించారు.



పొర్లుకట్ట వద్ద టపాసుల దుకాణంలో తనిఖీ చేస్తున్న సంతపేట పోలీసులు

రోడ్డు ప్రమాదంలో వ్యవసాయాధికారికి తీవ్ర గాయాలు

జలదంకి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారి బి.శైలజ సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఉదయం 10గంటల సమయంలో బ్రాహ్మణక్రాక పంచాయతీ పరిధిలోని విత్తనదుకాణాల పరిశీలనకు ఆమె కారులో వెళ్తున్న సమయంలో జాతీయ రహదారిపై జలదంకి సమీపంలోని ఆంజనేయ మిల్క్‌లైన్స్ ప్రహరీకి కారు అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏఓ తల వెనుకభాగం, కన్నుభాగంలో గాయాలయ్యాయి. రోడ్డుపై వెళుతున్న ప్రయాణికులు గుర్తించి ఆమెను 108లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు కార్పొరేట్ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న మండల నాయకులు, రైతులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.



దెబ్బతిన్న కారును పరిశీలిస్తున్న ఎస్ఐ లతీఫున్నీసా

అక్రమ మైనింగ్ కేసులో వైవీ రామిరెడ్డి అరెస్టు

రాపూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మైనింగ్ కేసులో వైసీపీ సీనియర్ నేత వైవీ రామిరెడ్డిని రాపూరు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీజ్ చేసిన ఎస్ఎల్‌వీ స్టోన్ క్రషర్‌లో నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన్ని రాపూరు తహసీల్దారు పి లక్ష్మీనరసింహం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అరెస్టు చేశారు. వైవీ రామిరెడ్డిపై కేసు నమోదు చేసిన రాపూరు పోలీసులు, వైద్య పరీక్షలు నిర్వహించి వెంకటగిరి కోర్టులో హాజరుపరిచేందుకు తరలించారు.

పోలీసుల అదుపులో కొమ్మలపూడి వైసీపీ నేత శ్రీనివాసులు

మనుబోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మలపూడి వైసీపీ నేత, మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షుడు చెందులూరు శ్రీనివాసులు యాదవ్‌ను సోమవారం మనుబోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనువాసులకు 41ఏ నోటీసు ఇచ్చి ఎస్ఐ శివరాకేష్ కొమ్మలపూడికి వెళ్ళి అతన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. చెరుకుమూడి రెవెన్యూ పరిధిలోని సర్వేనెం. 672-3, 704 తదితర పలు సర్వే నెంబర్లలో సుమారు 19 ఎకరాల 14 సెంట్లు భూములకు బోగస్ పట్టాదారు పాస్‌పుస్తకాలు సృష్టించి వాడుకున్నట్లు, అలాగే వాటిని రెవెన్యూ రికార్డులలో పొందుపరచకుండా చేసినట్లు, ప్రభుత్వ భూముల్లో పాతిన బోర్డులను తొలగించారంటూ తహసీల్దార్ సీహెచ్. సుబ్బయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ విచారణ చేస్తున్నామని, విచారణ పూర్తయితే పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి అరెస్టు చేయనున్నట్లు తెలిపారు.

ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలి : ఏఎస్పీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 100 ఫిర్యాదులు అందాయి. వీటిని పరిశీలించిన ఏఎస్పీ ఆయా ప్రాంతాల పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ గిరిధర్‌రావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుల స్వీకరణలో ఏఎస్పీ సౌజన్య

నా భార్యను నానుంచి పోలీసులే విడదీశారు : శివహేమంత్‌కుమార్

నా భార్యను నానుంచి పోలీసులే విడదీశారంటూ నెల్లూరు రూరల్‌లోని మూడవ మైలు ప్రాంతానికి చెందిన శివ హేమంత్‌కుమార్ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. నేను, నాల్గవమైలు ప్రాంతానికి చెందిన యనమల దివ్య 4 ఏళ్లుగా ప్రేమించుకున్నాం. ఈ విషయాన్ని మా తల్లిదండ్రులు ద్వారా దివ్య కుటుంబసభ్యులకు తెలియజేయగా వారు అంగీకరించక పోవడంతో ఈ ఏడాది సెప్టెంబరు 14న తిరుమలలో ఇద్దరం వివాహం చేసుకొని, చీరాలకు వెళ్లి అక్కడ నివాసం ఉంటున్నాం. రూరల్ పోలీసులు ఫోన్ చేసి అమ్మాయి తల్లిదండ్రులు కిడ్నాప్ కేసు పెట్టారని, తీసుకువస్తే విచారించి అమ్మాయి ఇష్టపూర్వకంగా వెళ్లిందని తెలిపితే పంపేస్తామని నమ్మించి స్టేషన్‌కు రప్పించారు. తరువాత తామెంత చెప్పినా వినకుండా నా భార్యను వారి తల్లిదండ్రులతో పంపేశారు. నాకు న్యాయం జరగకుంటే ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో మార్గం లేదని వాపోయాడు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	134
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	266
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7534
వెండి కిలో ధర	రూ. 99,000
వెండి ఒక గ్రాము	రూ.102.00

బ్రెయిన్ స్ట్రోక్ యమ డేంజర్!

అకస్మాత్తుగా వచ్చే బ్రెయిన్‌స్ట్రోక్ యమ డేంజర్. ఇది సంభవించిన వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స చేయించుకోకుండా ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా అది పక్షవాతానికి దారితీస్తోంది. బ్రెయిన్‌స్ట్రోక్ ఎప్పుడు ఎలా వస్తుందో చెప్ప లేని పరిస్థితి. ఒకప్పుడు వృద్ధాప్యంలో ఉన్న వారికి వచ్చే బ్రెయిన్‌స్ట్రోక్ ప్రస్తుతం 30 ఏళ్ల యువతకు కూడా వస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాల వల్ల కూడా అనేక మంది పక్షవాతానికి గురవుతోన్నారు.



● నిర్లక్ష్యం చేస్తే పక్షవాతం

● జిల్లాలో 60 వేల మందికి పైగా బాధితులు

● నేడు ప్రపంచ స్ట్రోక్ నివారణ దినం

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : శరీర అవయవాలను నియంత్రించే ప్రధానమైన మెదడులో రక్తం సరఫరా సరిగ్గా జరగక పోవడం, రక్తనాళాలు చిట్లడం వంటి సమస్యల వల్ల బ్రెయిన్‌స్ట్రోక్ వస్తోంది. మెదడుకు ఆక్సిజన్ సరఫరా మూడు నుంచి నాలుగు నిమిషాలు నిలిచిపోతే నరాలు చచ్చుబడి మెదడులోని వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమవుతోంది. కేవలం 10శాతం మందికే పక్షవాతంపై అవగాహన ఉండడంతో సగానికి పైగా వ్యాధిగ్రస్తులు అంగవైకల్యానికి గురవుతున్నట్లు వైద్యులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం పక్షవాత కేసుల్లో 20 నుంచి 30 శాతం చిన్నవయస్సు వారే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. కేన్సర్, గుండె వ్యాధులు తరువాత అత్యధికంగా చనిపోయే వ్యాధిగ్రస్తుల్లో పక్షవాతం వ్యాధి మూడవదిగా నిర్ధారణ అయింది. నేటి ఆధునిక సమాజంలో వైద్య రంగం ఎంతగా అభివృద్ధి చెందిన ప్రజల్లో వ్యాధిపై అవగాహన లోపంతో వ్యాధిగ్రస్తుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ అక్టోబరు 29వ తేదీని ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ నివారణ దినంగా జరుపుకోవాలని తీర్మానించింది.

● జిల్లాపై ప్రభావం ఎక్కువే..

బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిన 4గంటల లోపు వైద్య నిపుణులను సంప్రదించి వెంటనే చికిత్స చేయించుకోవాల్సి ఉన్నప్పటికీ అవగాహన లోపంతో చేసే ఆలస్యం కారణంగా అనేక మంది కాళ్లు, చేతులతో పాటు ఇతర అవయవాలు చచ్చుబడి పక్షవాతానికి గురవుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య 60 వేలకు మందికి పైగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం నెల్లూరు నగరంలోని పలు కార్పొరేట్ ఆసుపత్రులకు పక్షవాత వ్యాధిగ్రస్తులు ఎక్కువగా వస్తున్నారు. వ్యాధిపై పూర్తి అవగాహన లేకపోవడంతో ఆలస్యం చేయడంతో ఆసుపత్రికి వచ్చినా ఫలితం లేకుండా పోతోంది. దీని వల్ల దీర్ఘకాలికంగా చికిత్స చేయించుకొనే పరిస్థితి వస్తోంది. వ్యాధి లక్షణాలు గుర్తించి గంట లోపే ఆసుపత్రికి వస్తే వెంటనే వ్యాధిని నయం చేసే వీలుటుందని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని, జీవన శైలీ మార్చుకోవాల్సిన అవసరం ఉందని హెచ్చరిస్తున్నారు. కుటుంబంలో ఎవరికైనా పక్షవాతం ఉన్నట్లైతే తప్పనిసరిగా కుటుంబ సభ్యులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి.



ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు

బ్రెయిన్‌స్ట్రోక్‌ను ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా అది పక్షవాతానికి దారి తీస్తుంది. స్ట్రోక్ వచ్చిన నాలుగు గంటల్లోపు చికిత్స అందించాలి. లేదంటే అవయవాలు చచ్చుబడతాయి. చాలా మందికి అవగాహన లేకపోవటంతో వ్యాధి ప్రమాద స్థాయికి చేరుకుంటోంది.

- డాక్టర్ బిందుమీనన్, న్యూరో ఫిజీషియన్, అపోలో ఆసుపత్రి



అందుబాటులో ఆధునిక వైద్య విధానాలు

మెదడులోని గడ్డలను ఛిద్రం చేసే ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. దీనికి అల్ట్రాసౌండ్ ఎంతో ఉపయోగపడుతుంది. తద్వారా బ్రెయిన్ స్ట్రోక్‌ను నివారించవచ్చు. మెదడులో స్టెంట్ ఏర్పాటు చేసి కూడా పక్షవాతాన్ని నివారించవచ్చు.

- డాక్టర్ సంపత్‌కుమార్, న్యూరో ఫిజీషియన్, నారాయణ ఆసుపత్రి

వ్యాధి నిర్ధారణ - చికిత్స

- బ్రెయిన్‌స్ట్రోక్(పక్షవాతం) వ్యాధి నిర్ధారణ, చికిత్సకు ఎన్నో ఆధునిక విధానాలు అందుబాటులోకి వచ్చాయి.
- సిటీస్కాన్, ఎంఆర్ఐ, కరోటిడ్, ఆర్టరీ డాప్లర్ పరీక్ష, 2 డిఫో పరీక్ష, రక్తపరీక్షలు, యాంటియోగ్రఫీ పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు.
- వ్యాధి వచ్చిన వెంటనే నాలుగు గంటల లోపు టిస్యూ ప్లాస్మోనోజెన్ యాక్టివేటర్(టిపిఏ) చికిత్స చేసినట్లయితే వ్యాధి తీవ్రత చాలా వరకు తగ్గించవచ్చు.
- వైద్య చికిత్సలతోపాటుగా ఫిజియోథెరపి, స్పీచ్ థెరపి వంటి వైద్యసేవలు అందిస్తే రోగి త్వరగా కోలుకుంటారు.

వ్యాధి లక్షణాలు

- రోగి నవ్వినప్పుడు మూతి ఒక వైపునకు వంకరపోవడం
- రెండు చేతులు పైకి ఎత్తినప్పుడు ఒక చేయి ఎత్తలేని పరిస్థితి, మరో చేయి కిందికి క్రమంగా వాలిపోతుండడం.
- మాటలు సరిగా పలకకపోవడం.
- ముఖం, మూతి, చేయి, కాలు అకస్మాత్తుగా ఉన్నట్లుండి స్పర్శ తెలియకపోవడం.
- అకస్మాత్తుగా ఒక కంటిలో గాని రెండు కళ్లలో గాని చూపు మందగించడం.
- అకస్మాత్తుగా భరించలేని తలనొప్పి రావడం.
- జ్ఞాపకశక్తి తగ్గి ప్రవర్తనలో మార్పిడి రావడం.
- తల తిరగడం, వాంతులు.

వ్యాధి వచ్చే అవకాశం ఉన్నవారు

- రక్తపోటు(బీపీ) ఉన్న వారికి ఎక్కువ అవకాశం ఉంది.
- గుండె జబ్బులు ఉన్న వారికి.
- రక్తంలో ఎక్కువ శాతం కొవ్వు ఉన్న వారికి వస్తుంది.
- స్థూలకాయం(ఒబేసిటి) ఉన్న వారికి..
- అధికంగా మద్యం, ధూమపానం సేవించినా..
- శారీరక శ్రమలేని వారికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువ.

ఆత్మకూరును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

ప్రజా విజప్తుల కార్యక్రమంలో మంత్రి ఆనం

అనంతసాగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అభివృద్ధి పనులు చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం అనంతసాగరంలో జరిగిన ప్రజా విజప్తుల కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయ ఉద్యోగులతో 20 కౌంటర్లు ఏర్పాటు చేయగా 1420 మంది తమ సమస్యలు అన్‌లైన్ ద్వారా నమోదు చేసి మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆనం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో జిల్లాలో తొలిసారిగా ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమం నిర్వహించి పెద్దఎత్తున అర్జీలు స్వీకరించామని చెప్పారు. ప్రజావేదిక ద్వారా వచ్చిన ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించేలా కార్యచరణ చేశామన్నారు. నియోజకవర్గంలో రూ.12.85 కోట్లతో 196 సీసీ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగిందని, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి త్వరగా పూర్తిచేయాలని కోరారు. ఆత్మకూరు అభివృద్ధిలో భాగంగా నడికుడి రైల్వేలైన్ పనుల కోసం భూసేకరణ పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. హైలెవల్ కెనాల్ మొదటి విడత పనులు పూర్తి చేసి ప్రాధాన్యత క్రమంలో మొత్తం 6 రిజర్వాయర్లు పూర్తిచేస్తామని, ఉత్తర కాలువ సామర్థ్యం పెంపు పనులతో పాటు చివరి ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందిస్తామన్నారు. సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని, త్వరలో ఒక ఫార్మెట్ ఇచ్చి ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసి ప్రజా సమస్యలు గుర్తించేలా కార్యచరణ రూపొందించామని నవంబరు 10లోగా సర్వే పూర్తి చేయాలని కోరారు. యవతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన కోసం ప్రణాళికలు చేశామన్నారు. అనంతసాగరం మండలంలో 36 పనులకు రూ 1.63 కోట్లు విడుదల చేశారు. తొలుత మంత్రి సోమశిలలోని సోమేశ్వరుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో జేసీ కార్తిక్, ఆర్డీవో పావని, ఎన్‌డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయ్యరెడ్డి, తాళూరి గిరినాయుడు, మెట్టుకూరు కృష్ణారెడ్డి, మండల అధ్యక్షురాలు మునగపాటి సునీత పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి రామనారాయణ రెడ్డి

డిగ్రీ సెమిస్టర్ పరీక్ష కేంద్రాల్లో వీసీ తనిఖీ

వెంకటాచలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షా కేంద్రాలను వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా విడవలూరు, కోవూరులలో ఉన్న డిగ్రీ కళాశాలలను సందర్శించారు. పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న అధ్యాపకుల పనితీరు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు

పరీక్షలకు 396 మంది గైర్హాజరు

వీఎస్‌యూ అనుబంధ డిగ్రీ కళాశాల్లో సోమవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షలకు 396 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు విశ్వవిద్యాలయం పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలకు మొత్తం 7431 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 7035 మంది హాజరయ్యారని తెలిపారు.

అర్జీలు పునరావృతం కారాదు

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 28 : అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులను పిలిపించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. అర్జీలను పరిష్కరించకపోతే ఎందుకు పరిష్కరించలేదో అర్జీదారుకు తెలియచేయాలన్నారు.

సాగునీరు విడుదల చేయాలని బీజేపీ

జిల్లాలో వ్యవసాయ సీజన్ మొదలైందని, తక్షణమే సాగునీరు విడుదల చేయాలని కోరుతూ బీజేపీ నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందచేశారు. బుచ్చి, కోవూరు, ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు, టీపీ గూడూరు మండలాల్లో బీపీటీ రకం వరినాట్లు రైతులు నాటుతున్నారన్నారు. సుమారు రెండు లక్షల ఎకరాల్లో బీపీటీ రకం జిల్లాలో సాగవుతుందన్నారు. సకాలంలో ఆ పంటకు నీరు అవసరమన్నారు. ఐఏబీ సమావేశానికి సంబంధం లేకుండా వెంటనే సాగునీరు విడుదల చేయాలని కోరారు.

బ్లాస్టింగ్ వలన ఇల్లు కోల్పోయిన బాధితుడికి న్యాయం చేయాలి

రాపూరు మండలంలోని పులిగలపాడు గ్రామ సమీపంలో ఉన్న పీఎల్ఆర్ స్టోన్ క్రషర్స్ బ్లాస్టింగ్ వలన ఇల్లు కోల్పోయిన బాధితుడికి న్యాయం చేయాలని ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో నాయకులు కలెక్టరేట్‌లో ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆ స్టోన్ క్రషర్‌ను ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

న్యూస్ బాక్స్

ముమ్మరంగా వ్యవసాయ పనులు

వలేటివారిపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):మండలంలో వారంరోజులుగా వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎక్కువగా రైతులు పొగాకు, మిర్చి, వరినాట్లు వేస్తున్నారు. మంచి అదునులో వర్షం కురిసిందని పొగాకు, మిర్చి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

1న రాళ్లపాడు ఆయకట్టు రైతుల సమావేశం

లింగసముద్రం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సమావేశం శుక్రవారం ఉదయం 10గంటలకు ప్రాజెక్టు అతిథిగృహం వద్ద నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు ఏఈ చంద్రమౌళి సోమవారం ప్రకటనలో తెలిపారు.

'ఎస్సీ వర్గీకరణతో అన్యాయం'

అల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాల్మన్‌రాజు సోమవారం సంఘం సభ్యులతో కలిసి నార్తుమోపూరు దళితవాడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్సీలను బలహీనులను చేసేందుకు ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో ముసలి నరేంద్ర, పంగులూరు సుధాకర్, దానం మాల్యాద్రి, గంగపట్నం సతీష్, ఆశీర్వాదం ఉన్నారు.

పోలీసుల విధులపై అవగాహన

కొండాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు సోమవారం పోలీసుల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. స్థానిక స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా, పోలీసు లు పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై అవగాహన

బిట్రగుంట, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి): భారతపుత్ర ఛైర్మన్ కూరపాటి శ్యాంధన్ సోమవారం బోగోలు రాజావీధి సాయి మందిర ఆవరణలో ఆయుర్వేద మందుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా హ్యూమెన్‌రైట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సునీల్, జాయింట్ సెక్రెటరీ బత్తుల రవిచంద్ర హ్యూమెన్ రైట్స్ సభ్యులతో పాటు శ్రీదశ ఆయుష్ పీఠం నిర్వాహకులు శాంతిరాజ్ ఉన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

బిట్రగుంట, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు తెలిపారు. ఈ విషయంపై సోమవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో చిలకపాటి వెంకటేశ్వర్లు, కోడూరు వేంకటేశ్వర్లురెడ్డి, కాంద్ర రఘురామ్ నాయుడు, యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, పిన్ని బోయిన సుధాకర్, దేవరాల తిరుపతి, పుట్టా సుబ్బారావు, ఎన్.భాస్కర్, పార్వతి, నాగరాజు ఉన్నారు.

నేడు గంధ మహోత్సవం

ఉదయగిరి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనకాలువ సమీపంలోని హజరత్ సయ్యదినా మహబూబ్‌సుభానీ గంధమహోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఉదయగిరి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

శిథిలావస్థలో ఎస్సీ బాలుర హాస్టల్

- భవనం పెచ్చులూడి పడుతున్న వైనం
- భయాందోళనలో విద్యార్థులు

ఉలవపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహం శిథిలావస్థకు చేరింది. 40ఏళ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో భారీ వర్షాలకు భవనం స్లాబ్‌లోకి నీరు చేరి పెచ్చులూడి ఇనుప సువ్వలు బయటపడుతున్నాయి. ఈ సమస్యతో మొత్తం 8గదుల్లో 5గదులు మూతపడ్డాయి. మిగిలిన గదుల్లో రెండు గదులు విద్యార్థుల వసతికి ఉపయోగించగా మరొకటి స్టోర్ కమ్ ఆఫీస్ రూమ్‌గా వాడుకుంటున్నారు. విద్యార్థులు ఉంటున్న గదులు కూడా స్లాబ్ పెచ్చులూడి ఎవరి మీద పడతాయో అని భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి వసతి గృహంలో ఈ ఏడాది 35 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ సమస్యతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ హాస్టల్‌లో చేర్చేందుకు వెనకడుగు వెస్తున్నారు. ఆరేళ్లగా ఎస్సీ బాలుర వసతి గృహం పరిస్థితిని ఉన్నతాధికారులకు చెబుతున్నా వారు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం ప్రత్యామ్నాయ చర్యలు కూడా తీసుకోవడం లేదు. ఈ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎస్సీ బాలుర వసతి గృహం

సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మికుల ధర్నా

కావలి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్మికులు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచులయ్య, కృష్ణ మోహన్, మధుసూదన్ రావు, నాయకులు తురకా శీనయ్యబాబు, బీడదల మహేష్, పోలయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఆత్మకూరు,(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి కె పెంచలనరసయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడారు. ఆత్మ కూరు మున్సిపాలిటీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ డివిజన్ కార్యదర్శి ఆత్మకూరు నాగయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు గురవయ్య, రామయ్య, శీనయ్య పాల్గొన్నారు.



కావలి: ధర్నా చేస్తున్న కార్మికులు

ఎస్ఎఫ్ఐ విద్యార్థుల ఆందోళన

కావలిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద బైఠాయించి సమస్యలు పరిష్కారించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హర్ష, పట్టణ కార్యదర్శి ఉదయ్‌కుమార్‌లు మాట్లాడారు. పెండింగ్‌లోని కోట్ల రూపాయల విద్యాదీవెన, వసతిదీవెన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత ఇవ్వాలని, జీవో నెంబర్ 77 రద్దు చేసి పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింప జేయాలన్నారు. యూనివర్సిటీల అధ్యాపకులు పోస్టులన్నీ భర్తీ , సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జీవన్, మోక్షిత్‌సాయి, లోకేష్, భాను, సన్నీ, నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద బైఠాయించిన విద్యార్థులు

క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం

కావలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే ద గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక పుల్లారెడ్డిన గర్‌లో సోమవారం టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు నాయకులు తిరువీధి ప్రసాద్, ఉప్పాల వెంకట్రావు, దేవరకొండ శ్రీను, బోగ్యం క్రిషోర్‌కుమార్‌రెడ్డి, కేతిరెడ్డి విష్ణుతేజరెడ్డి జనసేన పట్టణ అధ్యక్షుడు పొబ్బా సాయివిఠల్ పాల్గొన్నారు.

కావలి రూరల్, అక్టోబరు 28: ముందర పొట్టెమ్మ తల్లి ఆసీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తులిసానేజ అన్నగారిపాలెంలో వెలసిన ముందర పొట్టెమ్మ, గంగమ్మ తల్లి ఆలయంలో సోమవారం నిర్వహించిన కుంబాభిషేకంలో ఆయన పాల్గొన్నారు. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ శ్రీధర్‌తో కలసి ఆలయ ప్రాగణంలో ఏర్పాటు చేసిన అన్నసంతర్పణలో పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావ్ పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయించరాదు

వలేటివారిపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవని డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. కాకుటూరు సమీపంలోని లావణ్య టపాసుల నిల్వ కేంద్రాన్ని సోమవారం ఆయన గుడ్లూరు సీఐతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. గతంలో ఇతర ప్రదేశాలలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటిస్తూ దుకాణాలు ఏర్పాటు చేసుకొని విక్ర యించాలన్నారు. వారి వెంట వలేటివారిపాలెం ఎస్ఐ మరిదినాయుడు, సిబ్బంది ఉన్నారు.

- **ఉత్తర్వుల మేరకు అమ్మకాలు**

కావలి రూరల్,(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు నల్లమందు అమ్మకాలు చేపట్టాలని కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన కొత్తపల్లిలో ఎస్‌కె.భాషకు చెందిన టపాసుల గోదామును తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ అమరవీరులదినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ ఆదేశాను సారం కొత్తపల్లి గ్లోబల్ స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

- **నిర్వాహకులతో సమావేశం**

సంగం, (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి తహసీల్దారు సంధ్య తహసీల్దారు కార్యాలయంలో టపాసుల దుకాణాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. స్థానిక ఎస్ఐ రాజేష్ టపాసుల దుకాణం లైసెన్సు పొందిన నిర్వాహకులతో స్టేషన్‌లో మాట్లాడి జాగ్రత్తలు తెలియజేశారు.

- **దుకాణాల పరిశీలన**

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు సుభద్ర, సీఐ వెంకటరావులు పట్టణంలోని బాణసంచా దుకాణాలు తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఏ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

- **గోదాము తనిఖీ**

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): కప్పరాళ్లతిప్ప సమీపంలోని టపాసుల గోడౌను సోమవారం కావలి డీఎస్పీ శ్రీధర్ తనిఖీ చేశారు. ఆయన వెంట పాటు స్థానిక ఎస్సై బోజ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.



వలేటివారిపాలెం: నిల్వ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

అలవి వలలతో జీవనోపాధి దెబ్బ

అనంతసాగరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో నిషేధిత అలవి వలలతో వేటసాగిస్తుండడంతో తమ జీవనోపాధి దెబ్బతింటోందని స్థానిక గిరిజన మహిళలు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి తెలిపారు. సోమవారం అనంతసాగరంలో జరిగిన ప్రజా విజప్తుల కార్యక్రమంలో పాల్గొన్న మంత్రిని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. జలాశయంలో అక్రమ చేపల వేట జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం విలేకర్ల ముందు తమ ఆవేదన వెళ్లగక్కారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు

- ఎక్సైజ్ సీఐ లక్ష్మణస్వామి



ఉదయగిరి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీలో ఏర్పాటుచేసిన ప్రైవేటు మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలని ఉదయగిరి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ లక్ష్మణస్వామి పేర్కొన్నారు. బెల్టుషాపుల ఏర్పాటు, కల్తీ మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ సందర్భంగా...

? : ఎన్ని మద్యం షాపులున్నాయి.

!: ఉదయగిరి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, మర్రిపాడు, దుత్తలూరు మండలాల్లో 12 ప్రైవేటు మద్యం షాపులు ఉన్నాయి.

?: దుకాణాల వద్ద మద్యం తాగవచ్చా

!: మద్యం దుకాణాల వద్ద తాగించకూడదు. అలా తాగిస్తే చర్యలు చేపడతాం. ప్రభుత్వం నుంచి పర్మినెంట్ దుకాణాలకు అనుమతి పొందితే అవకాశం ఉంటుంది.

?: బెల్టుషాపుల నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

!: బెల్టుషాపులు ఏర్పాటు చేసినా, మద్యం కల్తీ చేసినా చర్యలు తప్పవు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ దుకాణాలు నిర్వహించాలి. సమయపాలన పాటించాలి.

మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

సంగం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం జరిగే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎస్ఐ రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులు, యువకులు, ప్రజలు రక్తదానం చేయాలని ఆయన కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

సంగం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక పొదలకూరు శాఖ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం చేశారు. తరుణవాయి, ఉడ్‌హౌస్‌పేట, తలుపూరుపాడు, సిద్దీపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొదలకూరు కమిటీ సభ్యులు పెంచల నరసనయ్య, క్రిష్ణయ్య, కొండయ్య, శేషాద్రి పాల్గొన్నారు.

దుర్గం అభివృద్ధికి కృషి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్నలు పేర్కొన్నారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి దుర్గం ప్రాంతంలో చారిత్రాత్మక కట్టడాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారన్నారు. దీంతో ఉదయగిరి దుర్గానికి మహర్దశ పట్టనుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ మదన్‌కుమార్, ఏఈ మస్తాన్, టీడీపీ నాయకులు ఓబులరెడ్డి, నారాయణరెడ్డి, గంగాధర్, ప్రసాద్, వెంగళరావు, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వెలుగొండ పనులు పూర్తిచేయాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతాలకు జీవనాడి లాంటి వెలుగొండ ప్రాజెక్టు పనులు మందకొడిగా సాగుతున్నాయని, త్వరితగతిన పూర్తిచేయాలని వెలుగొండ సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ శ్యాంప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల వెలుగొండ సాధనసమితి ఆధ్వర్యంలో కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నాయకులతో వెలుగొండ ప్రాజెక్టు సొరంగ నిర్మాణ పనులను పరిశీలించామన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సాధన సమితి నాయకులు దస్తగిరిఅహమ్మద్, కాకు వెంకటయ్య, కాకు విజయమ్మ, సుజాత, షఫ్స్ రమణయ్య, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్య తీసుకోవాలి

కలువాయి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉయ్యాలపల్లిలో సోమవారం రీసర్వేపై నిర్వహించిన గ్రామసభకు తనకు కనీసం అధికారులు సమాచారం ఇవ్వలేదని గ్రామ సర్పంచు పుల్లే పరదేశి ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ విచారించి ప్రొటోకాల్ పాటించని అధి కారులపై చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భూ అక్రమణపై ఫిర్యాదు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జీ.చెర్లోపల్లిలో రంగమ్మ పేరంటాలమ్మ గుడి సమీపంలో భూమిని కొందరు అక్రమంచి చదును చేసి విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నారని గ్రామస్థులు సోమవారం తహసీల్దారు సుభద్రకు ఫిర్యాదు చేశారు. తహసీల్దారు పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గ్యాస్ సబ్సిడీని జమ చేయొద్దు

కావలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉచితగ్యాస్ సబ్సిడీలను లబ్ధిదారుల బ్యాంక్‌ల ఖాతాల్లో జమచేయవద్దని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సమితి ఆధ్వర్యంలో సోమవారం కావలి ఆర్డీవో ఎం.వంశీకృష్ణకు కలిసి వినతి పత్రం అందజేశారు.

అధిక ధరలకు విత్తనాలు అమ్మితే చర్యలు

కందుకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : డీలర్లు అధిక ధరలకు విత్తనాలు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని, విత్తనం కొనుగోలు చేసిన ప్రతి రైతుకు వారి అడిగినా అడగకున్నా విధిగా రసీదు ఇవ్వాలని కందుకూరు ఏడీఏ పి.అనసూయ సూచించారు. సోమవారం కందుకూరు లోని విత్తన దుకాణాలను ఆమె ఏఓ రాముతో కలిసి సందర్శించి డీలర్లకు సూచనలిచ్చారు. విత్తన నిల్వ పట్టికలో విత్తన రకం, స్టాకు మోతాదు, ధరను ప్రదర్శించాలని, ధ్రువీకరించిన విత్తన కంపెనీల విత్తనాన్ని మాత్రమే తీసుకోవాలన్నారు. నాసిరకం విత్తనాలు అమ్మినట్లు ఫిర్యాదులు వస్తే లైసెన్సు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం వరి, మినుము, నువ్వుల విత్తనాలు విత్తనాల డీలర్ల వద్ద సిద్ధంగా ఉన్నట్లు ఆమె తెలిపారు.

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, ఎరువుల అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయశాఖ అధికారి లలిత తెలిపారు. సోమవారం ఆమె పట్టణంలోని ఇందిరా సీడ్స్ దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వ్యవసాయ సీజన్ మొదలు కావటంతో రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారని ప్రతి విత్తన దుకాణాన్ని నిత్యం తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం బిల్ బుక్‌లు తనిఖీ చేసి సందేహం ఉన్న వరి విత్తనాలు నాణ్యతా ప్రమాణాల పరిశీలనకు పంపించారు.

ఏఎస్ పేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు, ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని నెల్లూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన ఏఎస్ పేట మండలంలోని హసనపురం, ఏఎస్ పేట ఎరువుల దుకాణలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి రజిని, ఆత్మకూరు వ్యవసాయ అధికారి కిశోర్, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ అనసూయ, ఏవో రాము

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి

కలిగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పొగాకు సాగు చేస్తున్న రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపాలని పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు తులసి తెలిపారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం జరిగిన రైతులతో నిర్వహించిన సమావే శంలో ఆర్ఎం మాట్లాడారు. ఈ ఏడాది ఇతర దేశాల్లో పొగాకు సాగు పెరిగిన దృష్ట్యా రైతులు పెసర, కంది, మినుము వంటి పంటల సాగు చేస్తే రైతు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి వీలు ఉంటుందన్నారు. అలాగే నారు మడులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీనియర్ శాస్త్రవేత్తలు కెవీకె ప్రసాద్‌బాబు తెలియజేశారు. కార్యక్రమంలో పొగాకుబోర్డు వేలం నిర్వహణాధికారి మహేష్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్, ఉద్యానశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత నివ్వాలని రీజనల్ మేనేజరు తులసి, వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. డీసీపల్లి పొగాకు బోర్డు పరిధిలోని పొగాకు రైతులతో సోమవారం బోర్డులో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు పంట పెరుగుతుందని, ప్రతీ రైతు అనుమతి మేర మాత్రమే పొగాకును సాగు చేయాలన్నారు. మినుము, శనగ, కంది, పెసర వంటి పంటలపై దృష్టి పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రసాద్‌బాబు, వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి రామ్మోహన్ రైతులు పాల్గొన్నారు.

భూ బాధితులకు న్యాయం చేయండి

కందుకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 167బీ జాతీయ రహదారి పనుల్లో భూమి కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లింపులో న్యాయం చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం సాయంత్రం ప్రకాశం జిల్లా కలెక్టరు తమీమ్ అన్సారియాను కలిశారు. ఎకరానికి రూ.25 లక్షలు మాత్రమే పరిహారంగా అందించారని, కానీ అక్కడ బహిరంగ మార్కెట్లో భూమి విలువ రూ.75లక్షలు ఉన్నదని కలెక్టరుకు వివరించారు.

సబ్ కలెక్టరుకు రైతుల వినతి: ఈ సమస్యపై సోమవారం బాధిత రైతులు సబ్ కలెక్టరు శ్రీపూజను కలిసి వినతిపత్రం అందజేశారు. బహిరంగ మార్కెట్లో రూ.2కోట్లు ఎకరం పలుకుతున్న భూములను జాతీయ రహదారి కోసం సేకరిస్తూ కేవలం రూ.25లక్షలు పరిహారం చెల్లిస్తామని చెబుతుండటం దారుణం అన్నారు. ఈ విషయంపై సబ్ కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు.

కందుకూరులో పోలీసుల రక్తదాన శిబిరం

కందుకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా కందుకూరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. రక్తదాన శిబిరంలో యువకులు పెద్దసంఖ్యలో తరలివచ్చి రక్తదానం చేయడం పోలీసుల పట్ల సమాజంలో ఉన్న గౌరవం అర్థమవుతోందన్నారు. 117మంది రక్తదానం చేయగా కావలి రెడ్‌క్రాస్ సొసైటీవారు రక్తం సేకరించారు. కార్యక్రమంలో కందుకూరు డీఎస్పీ బాలసుబ్ర హ్మణ్యం, సీఐ వెంకటేశ్వరరావు, పట్టణ ఎస్ఐ సాంబశివయ్య, రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచి ఛైర్మన్ చెన్నా వెంకటరామాంజనేయులు, సబ్ డివిజన్‌లోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, డీఎస్పీ

- 15 రోజుల్లో ఏసీ బస్‌షెల్టర్ల ప్రారంభం
- 20 రోజుల్లో 'హడ్కో' పనుల ఆరంభం
- పురపాలక శాఖా మంత్రి నారాయణ

రూ.28 కోట్లతో ప్రధాన కాలువల కాంక్రీట్ పనులు


మూలస్థానేశ్వరాలయంలో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరదల నుంచి నెల్లూరును కాపాడుకునేందుకు ప్రధాన డ్రైనేజీ కాలువలన్నీటిని రూ.28 కోట్లతో సిమెంట్ కాంక్రీట్ నిర్మాణాలతో పటిష్ఠం చేయనున్నట్లు రాష్ట్ర పురపాలకశాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించి మాట్లాడుతూ కొన్ని ప్రధాన కాలువలను ఎంపిక చేసి ఇరువైపుల, పైకప్పుతో పాటు సిమెంట్ నిర్మాణాలు చేపట్టే విధంగా ప్రణాళికలు తయారు చేశామన్నారు. తొలి విడతగా రూ.28 కోట్లతో వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తయ్యే విధంగా కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. నెల్లూరులో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాల్లో మిగిలిన రూ.165 కోట్ల పనులు హడ్కో నుంచి రుణం తీసుకుని మరో 20 రోజుల్లో మొదలుపెట్టనున్నామన్నారు. ప్రజల కోసం విదేశీ పరిజ్ఞానంతో నెల్లూరులో నిర్మించిన ఏసీ బస్‌షెల్టర్లను మరో 15 రోజుల్లో పూర్తి అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు. ఆరు నెలల్లో నెల్లూరులో గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సూర్యతేజ, కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి, ఎన్ఎంసీ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వైద్యం, విద్యకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని పురపాలక శాఖమంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పలువురు బాధితులకు రూ.6.18 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. బాధిత కుటుంబాలు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జరిగిన టీడీపీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శుల సమావేశంలో ఆయా డివిజన్‌లలో నెలకొన్న సమస్యలపై మంత్రి చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

● భక్తులే దేవుళ్లు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శైవక్షేత్రాల్లో నవంబరు 2 నుంచి 30వ తేదీ వరకు జరిగే కార్తీక మాసం వేడుకల్లో భక్తులనే దేవుళ్లుగా భావించి ఎలాంటి అసౌకర్యాలు లేకుండా వసతులు కల్పించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం రాత్రి మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. దేవదాయ, నగరపాలక సంస్థ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. 30 రోజులు భక్తులు కార్తీక దీపాలు వెలిగిస్తారని, అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తాళ్లపాక అనురాధ, విజయ భాస్కర్ రెడ్డి, మాజీ చైర్మన్‌లు మంచికంటి సుధాకర్‌రావు, సూరిశెట్టి నరేంద్ర, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' లెక్క తేలిందా..!?

● ముగిసిన సామాజిక తనిఖీలు ● ప్రతి గ్రామంలో వెలుగు చూసిన అక్రమాలు ● నేడు మండలస్థాయి సభలో బహిర్గతం


సౌత్‌మోపూరులో కూలీలను లెక్కిస్తున్న తనిఖీ అధికారి

నెల్లూరు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ నిధుల వినియోగంపై ఈనెల 20వ తేదీ నుంచి ఆదివారం వరకు డ్వామా అధికారులు సామాజిక తనిఖీలు నిర్వహించారు. అందులో వెలుగు చూసిన అక్రమాలను మంగళవారం మండలస్థాయి సభ ద్వారా బహిర్గతం చేయనున్నారు. 17 గ్రామ పంచాయతీల్లో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు పంచాయతీరాజ్, సామాజిక అటవీ, ఉపాధి హామీ పథకం, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం, గృహ నిర్మాణం, పశు సంవర్థక శాఖ, వెలుగు తదితర శాఖల ద్వారా జాయింట్ నిధులతో ఖర్చు చేసిన పనులను తనిఖీ బృందాలు క్షుణంగా పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. గ్రామ సభల ద్వారా పలు ఆరోపణలపై విచారణ చేపట్టి అన్నీ లెక్కకట్టారు. నిధులు దుర్వినియోగం, కూలీల లెక్కల్లో తేడాలు, ఎంబుక్కుల తయారీలో చేతివాటం, చేయని పనులకు చెల్లింపులు, రాని కూలీలను జాబితాల్లోకి ఎక్కించడం వంటి అక్రమాలన్నీటిని గుర్తించినట్లు సమాచారం. ఏడాది కాలం జరిగిన ఈ పనుల నిర్వహణలో పాల్గొన్న ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి ఉద్యోగులంతా వైసీపీకి చెందిన వారే. ఇష్టానుసారంగా పనులు గుర్తించిన గ్రామ నాయకులు అవినీతి, అక్రమాలుకు వేదికగా పథకాన్ని దుర్వినియోగం చేశారంటూ విమర్శలున్నాయి. తాజాగా వాటి లెక్కలన్నీ బయట పడుతున్న ఈ సమయంలో టీడీపీ అధికారంలో ఉండటంతో దోషులను గుర్తించి అవినీతి, అక్రమాలకు బాధ్యులను చేయాలన్న కసరత్తు జరుగుతుంది. నేడు నెల్లూరులోని ఎంపీడీవో కార్యాలయంలో జరుగు మండల స్థాయి సభపై ఉపాధి హామీ పథకం ఉద్యోగుల్లో ఉత్కంఠ నెలకొంది.

31 నుంచి ఉచిత గ్యాస్

● జిల్లా పౌరసరఫరాల అధికారి డీవీ రమణ



నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 28 : కూటమి ప్రభుత్వం తన ఎన్నికల హామీలో మహిళలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీ ప్రకారం ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభిస్తుంది. ఈ పథకం ఈ నెల 31వ తేదీ నుంచి అమలు జరుగుతుందని జిల్లా పౌరసరఫరాల అధికారి డీవీ రమణ వివరించారు. ఉచిత గ్యాస్ లబ్ధిదారుల కోసం ట్రోల్ ఫ్రీ నెం: 1967ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

? ఉచిత గ్యాస్ సిలిండర్‌కు ఎవరు అర్హులు.

! తెల్లరేషన్ కార్డు కలిగిన పేదలందరికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్‌పీజీ కనెక్షన్ కలిగి, ఆధార్ నెంబరు, బియ్యం కార్డు, ఇతర డేటాబేస్‌తో సరిపోలిన వారు, బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ అనుసంధానమై ఉంటే ఉచిత గ్యాస్ సిలిండర్‌కు అర్హులు.

? ఉచిత గ్యాస్ బుకింగ్ ఎప్పుడు చేసుకోవాలి.

! రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 31న ఉచిత గ్యాస్ పథకాన్ని ప్రారంభిస్తుం ది. ఈ పథకానికి సంబంధించి విధి విధానాలు ఇప్పటికే విడుదలయ్యాయి. ఈనెల 29 నుంచి గ్యాస్ బుకింగ్ చేసుకోవచ్చు.

? టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేశారా.

! ఉచిత సిలిండర్‌ను పొందడానికి వినియోగదారుల సౌకర్యార్థం 1967తో టోల్ ఫ్రీ నెంబరును ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

? మొదటి ఉచిత సిలిండర్‌ను ఎప్పుడు పొందవచ్చు.

! మొదటి ఉచిత సిలిండర్‌ను ఈనెల 31 నుంచి 2025 మార్చి 31 లోగా ఎప్పుడైనా పొందవచ్చు. రెండో సిలిండర్ ఏప్రిల్ 1 నుంచి జూలై 31 లోపు, మూడో సిలిండర్ ఆగస్టు 1 నుంచి నవంబరు 31 లోపు పొందాలని ప్రభుత్వం సూచింది.

అనుమతులున్న చోటే టపాసుల విక్రయం

● ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), అక్టోబరు28(ఆంధ్రజ్యోతి) : దీపావళి టపాసుల విక్రయాలను కార్పొరేషన్ అనుమతించిన చోటే విక్రయించాలని ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో టపాసుల విక్రయ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. నగరంలోని వీఆర్సీ, వైఎంసీఏ, సర్వోదయ, ఆర్ఎస్ఆర్, ఎస్వీజీఎస్ మైదానాలలో మాత్రమే దుకాణాల ఏర్పాటుకు ఈసారి అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇవి కాకుండా నగర పరిధిలో మరెక్కడైనా టపాసులు విక్రయాలు జరిపితే వెంటనే వాటి యజమానులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

మత్స్యకార గ్రామాల అభివృద్ధే ధ్యేయం

● ఎమ్మెల్యే సోమిరెడ్డి


సముద్ర తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి): మత్స్యకార గ్రామాలే అభివృద్ధే ధ్యేయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మండపం గ్రామ పంచాయతీ ఈదూరుపాలెం తీర ప్రాంత మత్స్యకార గ్రామంలో సోమవారం సోమిరెడ్డి పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా తీరప్రాంత మత్స్యకార గ్రామాల అవసరాల నిమిత్తం ఈ గ్రామానికి రూ.2కోట్ల 48 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. సెంట్ కార్ఫ్ ద్వారా మత్స్యకారులకు రావాల్సిన రాయితీ లు త్వరలో వచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, కోడూరు శ్రీనివాసులురెడ్డి, తాండ్ర ముని కృష్ణ, ముద్ద శ్రీహరి, మత్స్యకారనేత పామంజి వెంకటేశ్వర్లు, అన్ని శాఖల అధికా రులు స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు, తదిత రులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

మనుబోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి జహీర్ స్థానిక ఇందిరా సీడ్స్ దుకాణ యజమానులకు సూచించారు. సోమవారం ఆయన దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల్లోనూ రూ. 125లకే విత్తనాలను అందిస్తున్నామని ఆయన తెలిపారు.

న్యూస్ బాక్స్

ఆలయ భూములకు వేలం

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు28: (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ ఆలయంలోని టూరిజం గెస్టహౌస్‌లో సోమవారం పెనుబల్లి రెవెన్యూ పరిధిలోని 6.51ఎకరాలకు 3 ఏళ్ల కాల పరిమితితో లీజు వేలం నిర్వహించారు. ఈ వేలంతో ఏడాదికి రూ.1.32లక్షలు చొప్పున ఆలయానికి ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఏవీ. శ్రీనివాసులురెడ్డి తెలిపారు. దేవాదాయశాఖ పర్యవేక్షణ అధికారి జి. రామకృష్ణ, సిబ్బంది, పలువురు రైతులు వేలంలో పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు రెండు అర్జీలు

సైదాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

నెల్లూరు(విద్య), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు తమవంతుగా మొక్కలను నాటుతున్నామని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ నేతలు తెలిపారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సోమవారం మొక్కలు నాటారు. అనంతరం వాకర్స్ సభ్యులకు మొక్కలను అందచేయడంతో పాటు అందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ.సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి కె.జయదేవ్, సభ్యులు డాక్టర్ అంకిరెడ్డి, చింతల అమరేంద్రరెడ్డి, రవిచంద్ర, రామవేంద్రశెట్టి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రామ్మోహన్, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన అపస్మా నేతలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సోమవారం అమరావతిలో అపస్మా రాష్ట్ర నేతలు కలిసి విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ.65లక్షల చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అన్ని పాఠశాలల సహకారంతో వరద బాధితుల కోసం నిధులు సేకరించగా నెల్లూరు జిల్లా నుంచే రూ.30 లక్షల సమకూరాయన్నారు. ఈ కార్యక్రమంలో అపస్మా రాష్ట్ర నాయకులు నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎన్.శ్రీధర్, నగర కార్యదర్శి రమేష్, నేతలు పాల్గొన్నారు.

నేడు 'నారా లోకేష్ ఆరోగ్య రక్ష'

నెల్లూరురూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లకందుకూరులో మంగళవారం ఉదయం 9 గంటలకు నారా లోకేష్ ఆరోగ్య రక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ దాట్ల చక్రవర్థన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సజ్జాపురం, గొల్లకందుకూరు గ్రామాల్లో జరిగే ఈ శిబిరాలను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు.

నర్సులకు చీరల పంపిణీ

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : నగరంలోని జయభారత్ ఆసుపత్రిలో నర్సులకు శ్రీరంగనాథ భక్తమండలి, రాజరాజేశ్వరి భక్తమండలి ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ సీతాలక్ష్మి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకుని నిర్వాహకులు మెంటా రామమోహన్‌రావు ఈ సేవా కార్యక్రమం చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత మిడతల రమేష్, అల్లూరి నాగేంద్రసింగ్, నీలిశెట్టి లక్ష్మణరావు, సుజాత, మిడతల మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి


వెంకటాచలం : నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు


మనుబోలు : ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

● సీపీఎం నేతల నిరసన

వెంకటాచలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ట్రూ అఫ్ చార్జీల పేరిట విద్యుత్ ఛార్జీలు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నేతలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ తలారి దైవదానం, జిల్లా నాయకులు ఓడూరు వెంకటకృష్ణయ్య, చెంచురామయ్య, పొట్టేపాళెం సుధాకర్, షేక్ జిలాని తదితరులున్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

మనుబోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్లు, ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలంటూ సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కటికాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తలారి దేవదానం, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు బీసీ భాస్కర్, సీఐటియు నాయకులు ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు నాగేంద్ర ప్రసాద్ ఆత్మహత్య


హోంగార్డు నాగేంద్రప్రసాద్ మృతదేహం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోమ్‌గార్డు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేట శివాలయం సమీపంలో హోమ్‌గార్డు నాగేంద్రప్రసాద్(45), సుప్రియ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగేంద్రప్రసాద్ బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో హోమ్‌గార్డుగా విధులు నిర్వహిస్తుండగా, ఆయన భార్య నగరంలోని నర్తకి సెంటర్‌లో ఓ బట్టల దుకాణంలో పనిచేస్తున్నారు. ఆయన ఇటీవల మద్యానికి బానిసకావడంతో భార్య పలుమార్లు మద్యం మానేయాలని ప్రాధేయ పడింది. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో సోమవారం భార్య దుకాణంలో విధులు నిర్వహించేందుకు వెళ్లగా, పిల్లలు పాఠశాలకు వెళ్లారు. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న నాగేంద్రప్రసాద్ మధ్యాహ్నం భార్యకు ఫోన్‌చేసి ఉరివేసుకొని చనిపోతున్నానని బెదిరించారు. ఆమె ఎందుకు అలా చేస్తున్నావని చెప్పి ఇంటికి బయలుదేరింది. ఈలోగా ఆయన ఇంట్లోని ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి చేరుకున్న సుప్రియ తలుపులు తెరిచే ప్రయత్నం చేయగా రాకపోవడంతో స్థానికుల సహకారంతో తులుపులు తెరిచి చూడగా భర్త ఫ్యానుకు వేలాడుతూ కన్పించాడు. దీంతో స్థానికులు కిందకు దించి 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని నాగేంద్రప్రసాద్‌ను పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు బాధితురాలు చిన్నబాజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పగుడి సమీపంలో జరిగిన ఆటో మెకానిక్ హత్య కేసులో నిందితుడుని సోమవారం వేదాయపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇందిరమ్మ కాలనీకి చెందిన ముక్తియార్(38) అయ్యప్పగుడి సమీపంలోని పఠాన్ బాబుకు చెందిన ఆటోమెకానిక్ షెడ్‌లో గతంలో పనిచేశారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆయన తన ఆటోను తాకట్టుపెట్టారు. ఈనెల 24వ తేది సాయంత్రం ముక్తియార్ షెడ్ వద్దకు వచ్చి తాకట్టులో ఉన్న ఆటోను విడిపించుకునేందుకు రూ.30 వేలు కావాలంటూ బాబును వేధించడమే కాకుండా నానా దుర్భాషలాడాడు. కోపోద్రిక్తుడైన బాబు ఇనుపకమ్మితో ముక్తియార్‌ను హత్య చేసి పరారయ్యారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్ బాబును అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ట్రాలీ తగిలి కూలిన ఇరిగేషన్ బంగ్లా ప్రధాన గేట్లు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇరిగేషన్ బంగ్లా ప్రధాన గేట్లు కమ్ముల (స్టీల్) లోడుతో వచ్చిన ట్రాలీ ఢీకొనడంతో ధ్వంసమయ్యాయి. రూ.85కోట్లతో సంగం బ్యారేజీ నుంచి బుచ్చికి ఏర్పాటు చేస్తున్న జలజీవన్ 2.0 మంచినీటి సరఫరా పథకం పనుల కోసం ట్రాలీలలో కమ్ములు(స్టీల్) తీసుకువచ్చారు. ఐతే ఆ లోడు బంగ్లాలోకి తీసుకెళ్లేందుకు వెనుకవైపు ప్రహరీ తొలగించి లోపనికి తీసుకెళ్లే అవకాశం వుంది. ఐతే ట్రాలీలను ప్రధాన దారిగుండా వెళ్లడంతో ప్రధాన ద్వారాలు కూలిపోయాయి. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది.

హౌసింగ్ ఏఈగా మహేష్

పొదలకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు హౌసింగ్ ఏఈగా మల్లినేని మహేష్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

కేరళ తరహా వక్ఫ్ చట్టం అమలు చేయాలి

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వక్ఫ్ చట్టాన్ని కేరళ ప్రభుత్వం తరహాలో అమలు చేయాలని రాజ్యాంగ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మౌలానామొహమ్మద్ ఇలియాస్, అబ్దుల్ కరీమ్, షకీల్, నవీన్, అహ్మద్ సర్దార్, అబ్దుల్‌గనీలు వినతిపత్రం అందజేశారు. అలాగే ఆత్మకూరు బస్టాండు పక్కన గల మసీద్‌కు సమీపంలో మద్యం షాపు ఏర్పాటు చేస్తున్నారని దానిని వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

ఆసుపత్రుల్లో మహిళల భద్రతపై ప్రత్యేక కార్యాచరణ : ఆర్డీవో

నెల్లూరు(వెంకటేశ్వరపురం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో మహిళల భద్రతపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నెల్లూరు ఆర్డీవో అనూష పేర్కొన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కోల్‌కత్తాలో జరిగిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలతో పలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఆసుపత్రుల్లో మహిళలకు ఎలాంటి భద్రతా ప్రమాణాలు చేపట్టాలన్నదానిపై పూర్తి స్థాయిలో అవగాహన కార్యక్రమాలను త్వరలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో పలు ఆసుపత్రులు నిర్వాహకులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విడవలూరులో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

విడవలూరు, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వీపీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కేన్సర్ స్క్రీనింగ్‌వైద్య పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, సత్యవోలు సత్యంరెడ్డిలు మాట్లాడారు. కేన్సర్ వ్యాధిని తరిమికొట్టాలనే లక్ష్యంతో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పని చేస్తున్నారని కొనియాడారు. ఈ శిబిరం నవంబరు 3వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నేతలు అడపాల శ్రీధర్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, చెముకుల శ్రీనివాసులు, రామిశెట్టి వెంకటేశ్వర్లు, తాతా బాలకృష్ణ, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, దీలిప్ పాల్గొన్నారు.

వినతులు స్వీకరించిన ఏడీసీ నందన్

నెల్లూరు(సిటీ), అక్టోబరు28(ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఏడీసీ నందన్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 19వ డివిజన్‌లో తమ కార్యకర్తకు సంబంధించిన వాటర్ ప్లాంటును అన్యాయంగా సీజ్ చేశారని వైసీపీ నేత ఆనం విజయకుమార్ రెడ్డి వినతిపత్రం అందచేశారు. 13వ డివిజన్‌లో ఆక్రమణలు తొలగించాలని కోరారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన

తాము 30 రోజులు పనిచేస్తే 20 రోజుల జీతం అందుతుందని ఆందోళన చెందుతూ పారిశుధ్య కార్మికులు సోమవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో సీపీఎం నేత కత్తి శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం : ఎస్పీ కృష్ణకాంత్


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్పీ జి కృష్ణకాంత్ పేర్కొన్నారు. అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థ, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, మెడికల్ క్యాంప్‌లను ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం విషయంలో అపోహలు వద్దని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వలన ఇతరులకు ప్రాణదాతలు అవుతారన్నారు. నిస్వార్థంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన పోలీసు సిబ్బంది, అధికారులు, యువకులు, విద్యార్థులకు జిల్లా పోలీసు శాఖ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, పోలీస్ యూనిట్ వైద్యశాల డాక్టర్ అఖిలేష్, డాక్టర్లు పి.అశ్విన్ కుమార్, పి.మాధవ్‌రావు, యం వెంకటతరుణ్, ఆర్ గోకుల్ కృష్ణన్, సి ప్రేమ్‌దీప్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మంగలికట్ట వాసుల నిరసన

● బుచ్చిలో ఉద్రిక్తత


బస్టాంబ్ సెంటర్లో నిరసనకు దిగిన మహిళలు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): మా మంగలికట్ట కాలనీలో పందుల నిర్వాహకులు నివాసం ఉండరాదని వాళ్లను ఇక్కడి నుంచి వేరే ఎక్కడికైనా పంపించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి సుమారు 7గంటల ప్రాంతంలో 500మందికిపైగా మంగలికట్టవాసులు జాతీయ రహదారిపైన నిరసన చేపట్టారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న సీఐ సిబ్బందితో వచ్చి అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని విరించి అక్కడ నుంచి వెళ్లేలా చేశారు. అనంతరం పందులోళ్ల ఆక్రమణ తొలగింపు ప్రాంతంలోని కమిషనర్ కారును అడ్డుకుని ఆయన్ను నిలదీశారు. మంగళవారం కౌన్సిలర్లు, అధికారులతో మాట్లాడి విషయం చెబుతానని నచ్చజెప్పి పంపించారు. ఇక్కడి నుంచి కమిషనర్ వెళ్లిపోనీ పందుల యజమానులు అసభ్యకరంగా మాట్లాడటంతో మంగలికట్ట మహిళలంతా ఏకమై బస్టాండ్ సెంటర్‌లో నిరసనకు దిగారు.

పునరావాసాలు చూడకుండా...

పునరావాసాలు లేకుండా ఆక్రమిత స్థలాల నుంచి తరలించమని ఎవ్వరూ చెప్పరు. తరలించే ముందు ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో చర్చించి పునరావాసాలు చూసి తరలించాలి కాని ఎవరో కట్టుకున్న ఇళ్లలోకి పంపించి వాళ్లను భయాందోళనకు గురి చేయడం ఏంటని కౌన్సిలర్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి తెలిపారు.

జాషువా గ్రంథాలయం పనులు పూర్తి చేయిస్తాం

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర


బీద రవిచంద్రను సన్మానిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గుర్రం జాషువా ప్రజా గ్రంథాలయం పనులను పూర్తి చేయిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర చెప్పారు. సోమవారం జరిగిన ఆ గ్రంథాలయ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడతూ జాషువా గ్రంథాలయాన్ని అంచలంచెలుగా అభివృద్ధి చేసి, బడుగు, బలహీన వర్గాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దడానికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఈ గ్రంథాలయ పునర్నిర్మాణ పనులు మొదలు పెడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రంథాలయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్కే ఖాసీం, జెన్ని రమణయ్య, కుసుమ కుమారి, కొమ్మల కృష్ణయ్య, బుల్లార్డ్ ప్రేమ్‌కుమార్, రేవతి, దత్తాత్రేయ, ఇంజనీర్ జయధర్, సురేంద్ర, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సిలిండర్లకు
నేటి నుంచి బుకింగ్

● జిల్లాలో 4.48 లక్షల మందికి ఏటా రూ.110.2 కోట్ల లబ్ధి



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో భాగంగా దీపావళి నుంచి ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీనికి మంగళవారం నుంచి లబ్ధిదారులు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. తెల్ల రేషన్‌కార్డు కలిగి, గ్యాస్ కనెక్షన్లు ఉన్న వారంతా ఈ పథకానికి అర్హులుగా మారనున్నారు. నిత్యావసర సరుకుల భారం పెరుగుతున్న ప్రస్తుత రోజుల్లో ఈ ఉచిత గ్యాస్ పథకంతో కొంత వెసులుబాటు కలుగుతుందని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 4.48 లక్షల మందికి ఏటా మూడు ఉచిత సిలిండర్లు అందనున్నాయి. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.839 ఉంది. దూరాన్ని బట్టి రవాణా చార్జీలు అదనంగా ఉంటాయి. ఈ రూ.839లో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రూ.19 రాయితీగా తిరిగి ఖాతాల్లో జమ చేస్తోంది. ఇది పోను రూ.820 లబ్ధిదారులు చెల్లిస్తున్నారు. ఈ మొత్తాన్ని లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనుంది. ఒక్కో సిలిండర్‌కు రూ.820 చొప్పున ఏడాదికి మూడింటికిగాను రూ.2400 లబ్ధి కలగనుంది. ఈ లెక్కన మొత్తం 4.48 లక్షల మందికి ఏటా రూ.110.2 కోట్ల లబ్ధి చేకూరనుంది. కాగా, గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకున్న వారు ముందుగా సొమ్ము చెల్లించాక వారి వ్యక్తిగత ఖాతాల్లో ప్రభుత్వం నగదు బదిలీ విధానం ద్వారా తిరిగి సొమ్ము జమ చేయనుంది. దీంతో ప్రస్తుతం పాత పద్ధతిలోనే సిలిండర్లు బుక్ చేసుకోవాలి.

గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ఇలా..

మొదటి సిలిండర్‌ను ఈ నెల 29వ తేది నుంచి బుక్ చేసుకోవాలి. రెండో సిలిండర్ వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి జూలై 31 లోపు, మూడవది ఆగస్టు 1 నుంచి నవంబరు 30వ తేదీ లోపు పొందాలి.

నేటి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం



తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: తెల్లరేషన్‌కార్డు పేదలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం మంగళవారం నుంచి అమలుకానుందని జేసీ శుభం బన్సల్ తెలిపారు. ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ ఉన్నవారు, ఆధార్‌కార్డు, బియ్యం కార్డు, ఇతర శాఖల డేటాబేస్‌లో గ్యాస్ కనెక్షన్లు, బియ్యంకార్డు, ఆధార్‌కార్డు సరిపోలి ఉండాలని సూచించారు. అ అర్హతలతో పాటు బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధనమైవారు ఉచిత గ్యాస్ కనెక్షన్‌కు అర్హులన్నారు. మొదట గ్యాస్ ఏజెన్సీకి సిలిండర్‌కు డబ్బులు చెల్లిస్తే 48గంటల్లో లబ్ధిదారుల ఖాతాలో జమవుతుందన్నారు.

జిల్లాను ప్రథమ స్థానంలో
నిలబెడదాం

సమన్వయంతో కూటమి ఆశయాలను సాకారం చేద్దాం

జిల్లా నేతలతో ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి నాయకులు, అధికార యంత్రాంగం సమన్వయంతో జిల్లాను అన్నిరంగాల్లో ప్రథమ స్థానంలో నిలబెడతామని, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. ఇంచార్జి మంత్రిగా నియమితులైన ఆయన సోమవారం తొలిసారి జిల్లా ఎన్డీఏ నేతలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోనే ప్రతిష్ఠాత్మకమైన తిరుపతి జిల్లాకు ఇంచార్జి మంత్రిగా నియమించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ఎమ్మెల్యేలుగా కూటమి నేతలే ఉండటంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూడా అంతే సహకారంతో ముందుకు పోవాలన్నారు. నాయకుల మధ్య ఏదైనా అభిప్రాయబేధాలువస్తే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అనగాని లాంటి సమర్థులైన మంత్రిని జిల్లాకు నియమించడం ఆనందంగా ఉందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. లోకేశ్ రెడ్ బుక్‌ను త్వరగా తెరవాల్సిన అవసరం ఉందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. క్రీడాభివృద్ధికి తమ సహకారం ఉంటుందని, నియోజకవర్గాల్లోని ఆటస్థలాలను ప్రజాప్రతినిధులు పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని శాప్ ఛైర్మన్ రవినాయుడు కోరారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ అధ్యక్షత వహించిన ఈసమావేశంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని (చంద్రగిరి), పాశం సునీల్‌కుమార్ (గూడూరు), రామకృష్ణ (వెంకటగిరి), నెలవల విజయశ్రీ (సూళ్లూరుపేట), మాజీ ఎంపీ పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, మోహన్, ఎస్సీవీ నాయుడు, హేమలత, మునిరామయ్య, జనసేన నేతలు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజా రెడ్డి, సుభాషిణి, బీజేపీ నేత అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఎన్డీయే కూటమి నేతల సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

ఎమ్మెల్యే ఎందుకయ్యామా..!

- బాధేస్తోందన్న బొజ్జల సుధీర్
- టీడీపీ, జనసేన నేతల వాగ్వాదంతో శ్రీకాళహస్తి సమీక్ష నేటికి వాయిదా
- గొడవలతో అర్ధంతరంగా ముగిసిన సత్యవేడు సమీక్ష
- చంద్రగిరిలోనూ టీడీపీ, జనసేన నేతల వాగ్వాదం
- తిరుపతిలో అధికారులపై కూటమి నేతల ఫిర్యాదు
- ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ సూళ్లూరుపేట బీజేపీ నేతల ఫిర్యాదు
- తిరుపతిలో ఇన్‌చార్జి మంత్రి ఎదుట జిల్లా కూటమి నేతల పంచాయితీ

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'అనవసరంగా చెడ్డపేరు వస్తోంది. ఎమ్మెల్యేగా ఎందుకయ్యామా అని బాధేస్తోంది' అంటూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వాపోయారు. తిరుపతిలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో సోమవారం రాత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ నియోజకవర్గాల వారీగా కూటమి నేతలతో సమావేశాలు నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ కూటమి నేతలతో మంత్రి సమీక్ష సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. తన నియోజకవర్గంలో ఇసుక అధికంగా ఉండటంతో ఎవరు పడితే వారు తవ్వకాలకు, అక్రమ రవాణాకు పాల్పడుతున్నారన్నారు. వాళ్లంతా తన పేరు చెప్పి చెడ్డపేరు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక, ఇరుగుపొరుగు నియోజకవర్గాల వారూ ఇక్కడి ఇసుకపై కన్నేసి దుర్వినియోగం చేస్తున్నారని, దాన్ని తనకు ఆపాదించి వైసీపీ అనుకూల మీడియా అప్రదిష్టపాలు చేస్తోందని వేదన చెందారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని ఇసుక అక్రమాలను అడ్డుకోవాలే తప్ప ఇలా నిరాశగా మాట్లాడడం తగదంటూ ఆయన్ను మంత్రి సత్యప్రసాద్ అనునయించారు. గత ఐదేళ్లలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నేతలు బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. అప్పటి రెవెన్యూ అధికారులతో కలసి వైసీపీనేతలు పెద్ద ఎత్తున భూ రికార్డులు తారుమారు చేయడంతో ఇపుడు ప్రజల నుంచీ ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని వివరించారు. వాటి పరిష్కారానికి ఇపుడున్న రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయడం లేదన్నారు. భూ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. నియోజకవర్గంలో ఇసుక విషయంలో పాత వైసీపీ విధానాన్నే అనుసరిస్తున్నందున చెడ్డపేరు వస్తోందని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు అభిప్రాయపడ్డారు. అధికారులతో పకడ్బందీగా పనిచేయిస్తే చెడ్డపేరు రాదన్నారు. తమకు ఎలాంటి ప్రాధాన్యతా లేదని, ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవడం లేదంటూ జనసేన ఇంచార్జి నగరం వినుత తదితరులు ఫిర్యాదు చేశారు. వైసీపీపై పోరాడిన తమపై 17 అక్రమ కేసులున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాగా, టీడీపీ గెలుపునకు పనిచేయలేదని, ప్రచారానికి దూరంగా ఉన్నారని టీడీపీ నేతలూ ప్రత్యారోపణ చేశారు. ఈ సందర్భంగా ఇరువర్గాల నడుమ వాగ్వాదం చోటు చేసుకోవడంతో మంత్రి సమావేశాన్ని ముగించారు. మంగళవారం ఉదయం మరోసారి సమావేశమవుదామని వాయిదా వేశారు.

అర్ధంతరంగా ముగిసిన 'సత్యవేడు' సమావేశం


సత్యవేడు సమీక్షకు సస్పెన్షన్‌లో ఉన్న కారణంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరు కాలేదు. నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త శ్రీపతి బాబు, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంఛార్జులు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే హేమలత కూడా హాజరు కావడంతో గొడవ జరిగింది. తొలుత ఎమ్మెల్యే అనుకూల వర్గానికి చెందిన నేతలు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేపై సస్పెన్షన్ విధించడంతో అభివృద్ధి పనులు జరగడం లేదని మంత్రి ఎదుట వాపోయారు. సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండు చేశారు. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఓడిపోవాలనే ఉద్దేశంతో ఇండిపెండెంట్ అభ్యర్థికి అనుకూలంగా పనిచేసిన హేమలతను సమావేశానికి ఎలా పిలిచారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వైసీపీ వారికి పనులు చేస్తున్నారని, కాబట్టి సస్పెన్షన్ ఎత్తివేయకూడదని వ్యతిరేక వర్గ నేతలు పట్టుబట్టారు. తమకు ఎలాంటి ప్రాధాన్యతా ఇవ్వడం లేదంటూ జనసేన నేతలు మంత్రికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సమావేశం రచ్చరచ్చగా మారడంతో వచ్చే నెల 10 లేదా 11న ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేస్తామంటూ మంత్రి సమీక్షను ముగించారు.

వైసీపీ కార్పొరేటర్లను చేర్చుకోవద్దు

తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి నేతలను ఎన్నో ఇబ్బందులకు గురిచేసి, దౌర్జన్యాలతో ఏకగ్రీవాలైన వైసీపీ కార్పొరేటర్లను టీడీపీలోకి చేర్చుకోవద్దంటూ పలువురు నేతలు ఇన్‌చార్జి మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఒక పార్టీ చేర్చుకోకపోతే మరో పార్టీలో చేరే అవకాశాలు ఉంటాయికదా? అన్న మంత్రి ప్రశ్నకు.. కూటమి పార్టీలన్నీ ఒకే మాటపై ఉంటే వైసీపీ వాళ్లకు అవకాశం ఉండదని, రాబోయే ఎన్నికల్లో కూటమి పార్టీలో కష్టపడిన నాయకులకు కార్పొరేట్ టికెట్లు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. దీనిపై అధిష్ఠానంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని మంత్రి బదులిచ్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపైనా టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. వీఐపీల పర్యటనల్లో తమకు సమాచారం ఉండడంలేదని, వైసీపీ నాయకులతో అనుకూలంగా వ్యవహరిస్తున్నారని చెబుతుండగా..జనసేన నాయకులు ఖండించారు. తమ సమస్యలపై కమిషనరు మౌర్య స్పందించడం లేదని, ఆమెను బదిలీ చేయాలని టీడీపీ నాయకుడొకరు మంత్రికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తిరుమలలో రెవిన్యూ విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారి అక్రమ దుకాణాల ఏర్పాటుకు కారకుడంటూ ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని పలువురు మహిళా నేతలు కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, బొజ్జల సుధీర్, పులివర్తి నానీ, జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్, బీజేపీ నేత అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి జనసేన నేతపై ఫిర్యాదు

చంద్రగిరి నియోజకవర్గంలో జనసేన నేత తీరుపై పలువురు టీడీపీ నాయకులు మంత్రికి ఫిర్యాదు చేశారు. తొలుత జనసేన నేత ఒకరు తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, రాజకీయంగా అణగదొక్కేందుకు యత్నిస్తున్నారని ఆరోపించడంతో టీడీపీ నాయకులు ఎదురు దాడికి దిగారు. భూ వివాదాలు, కబ్జాల్లో తలదూర్చి కూటమి పార్టీలకు, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని మంత్రికి ఫిర్యాదు చేశారు. వైసీపీ ముఖ్యనేతతో రాజీపడి, వైసీపీ వర్గీయులకు అనుకూలంగా సిఫారసులు చేస్తున్నారని పలు ఉదంతాలు ప్రస్తావించారు. ఓ మహిళా నేత తన వ్యక్తిగత సమస్య విషయంలో జనసేన నేత ప్రత్యర్థులకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. దీంతో మంత్రి సర్దిచెప్పారు. ఎమ్మెల్యే పులివర్తి నానీ మాట్లాడుతూ ఏ స్థాయి నాయకుడు సిఫారసు చేసినా తాను వైసీపీ వ్యక్తులకు పనులు చేయనని, వైసీపీకి అనుకూలంగా పనిచేసిన వారి బదిలీలకు సిఫారసు చేయనని తేల్చి చెప్పారు.



నకిలీ పత్రాలతో రుణం పొందిన
ముగ్గురు మోసగాళ్ల అరెస్టు

● రూ.6 లక్షల నగదు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నకిలీ భూమి డాక్యుమెంట్లు తాకట్టుపెట్టి తిరుపతి ఎస్‌బీఐలో దాదాపు రూ.2.80 కోట్ల రుణం పొందిన ముగ్గురిని క్రైం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.9 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి క్రైం డీఎస్పీ రమణకుమార్ తెలిపిన ప్రకారం.. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన కడియాల రామారావు, చిలకలూరిపేటకు చెందిన అన్నపురెడ్డి శ్రీనివాసరావు, విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన కంచుపాటి బ్రహ్మయ్య కలిసి సులభంగా డబ్బు సంపాదించడానికి ప్రణాళిక రచించారు. రేణిగుంట మండలంలో ఫ్లోర్ క్లీనింగ్ మ్యాట్స్ తయారుచేసే లక్ష్మీనరసింహ పేరుతో పరిశ్రమ ఏర్పాటుకని తిరుపతికి వచ్చారు. స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్‌కు రూ.5 కోట్ల వరకు రుణం ఇచ్చే న్యూబాలాజీకాలనీలోని ఎస్‌బీఐ బ్రాంచిని సంప్రదించారు. ఆస్తి దస్తావేజులు సమర్పించి రూ 2.80 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ తర్వాత కంతులు తిరిగి చెల్లించలేదు. దీంతో ప్రస్తుత బ్యాంకు అధికారులు, క్షేత్ర సిబ్బంది, విజిలెన్సు అధికారులు పరిశ్రమ వద్దకు వెళ్లి చూడగా రుణం తీసుకున్న పరిశ్రమ మూతపడి ఉంది. ఫ్యాక్టరీలో ఎలాంటి ఉత్పత్తులు లేకపోగా రెండేళ్ల కిందటే మూసేసి ఉండటంతో యంత్రాలన్నీ పాడైపోయాయి. దీనిపై వారు తిరుపతి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు ఆధ్వర్యంలో డీఎస్పీ రమణకుమార్, సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. నిందితులు ఉపయోగిస్తున్న మొబైల్ ఫోన్లు, చిరునామాల ఆధారంగా వారి కదలికలను గుర్తించారు. సోమవారం తిరుపతిలోని టౌన్‌క్లబ్ వద్ద నిఘా ఉంచి వారిని పట్టుకుని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. రూ.ఆరు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇదే కేసులో మరికొంతమందిని అరెస్టు చేసి నగదు రికవరీ చేయాల్సి ఉందన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు

తిరుమల, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ సోమవారం ప్రకటించింది.



పచ్చని పొలంలో తెల్ల కొంగలు

వ్యవసాయ పనులు ఊపందుకుంటున్న వేళ పొలాల్లో కొంగల సందడి ఎక్కువైంది. దమ్ము చేసిన పొలాల్లో, ఏపుగా పెరిగిన పచ్చని పైరుల మధ్య, పిల్ల గాలులకు కొంగలు అటు ఇటు ఎగురుతూ కనువిందు చేస్తున్నాయి. పంటలకు కీడు తలపెట్టే పురుగులను ఏరి తింటూ రైతులకు మిత్రుల్లా సాయం చేస్తున్నాయి. నాగలాపురం మండలం గోపాలపురం వద్ద పొలాల్లో గుంపులుగా వాలిన కొంగలు చూపరులను ఆకట్టుకున్నాయి.

- సత్యవేడు, ఆంధ్రజ్యోతి

ఏంటి సిస్టర్ ఇది?

స్విమ్స్‌లోని ఓపీ విభాగం సోమవారం రోగులతో కిక్కిరిసిపోయివుంది. న్యూరాలజీ ఓపీ విభాగంలో వందమందికి పైగా రోగులు వైద్యుల అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. అక్కడ బీపీ, పల్స్ చూడాల్సిన స్టాఫ్‌నర్సు ఇలా ఫోను చూస్తూ ఉన్నారు. మధ్యమధ్యలో కాసేపు బీపీ చెక్ చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు ప్రారంభం



ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

చంద్రగిరి, అక్టోబరు 28: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అన్నప్రానాయనం నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం స్వామి అమ్మవార్లను మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. పవిత్రోత్సవాల కారణంగా సోమవారం నుంచి బుధవారం వరకు కల్యాణోత్సవం, మంగళవారం స్వర్ణపుష్పార్చన, బుధవారం అష్టోత్తర శతకళశాభిషేకం, ఆర్జితం సేవలను టీటీడీ రద్దు చేసింది. గృహస్తులు(ఇద్దరు) రూ.500 చెల్లించి పవిత్రోత్సవాల ఆర్జిత సేవలో పాల్గొనవచ్చు. పవిత్రం, ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు కిరణ్ కుమార్‌రెడ్డి, అనంబట్టు ధనశేఖర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ప్రభుత్వ భూమిలో ఆక్రమణలకు పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు

వడమాలపేట, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం బంగారెడ్డి ఎస్టీ కాలనీకు సమీపంలో ప్రభుత్వ గుట్ట పోరంబోకు ఆక్రమణను తొలగించారు. 'ప్రభుత్వ భూమికి కంచె' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించారు. ప్రభుత్వ భూముల్లో ఎవరు చొరబడినా శిక్షార్హులేనని, క్షమించేది లేదని తహసీల్దారు జరీనా హెచ్చరించారు.

స్వర్ణముఖిని పరిశీలించిన అధికారులు



ఇసుక తవ్విన ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దారు, సీఐ తదితరులు

రేణిగుంట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని తహసీల్దారు శ్యాంప్రసాద్ హెచ్చరించారు. 'వాళ్లు, వీళ్లు కలిసి ఇసుకను దోచేస్తున్నారు' అంటూ ఇసుక అక్రమ రవాణాపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. గాజులమండ్యం సీఐ మురళీకృష్ణ, వీఆర్వో, వీఆర్‌ఏ, కానిస్టేబుల్‌తో కలిసి కొత్రమంగళం స్వర్ణముఖి నది తీర ప్రాంతాన్ని పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ప్రాంతాలను, రోడ్లను పరిశీలించారు. ఇక్కడి తవ్వకాలపై ఉన్నత అధికారులకు నివేదిక అందించినట్లు తహసీల్దారు తెలిపారు. ప్రతిరోజు వీఆర్వో, వీఆర్‌ఏ, పోలీసు బ్లూకోల్ట్ వేర్వేరుగా ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో గస్తీ చేపడతారన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్పీ



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా టపాసుల తయారీ, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సుబ్బరాయుడు సోమవారం హెచ్చరించారు. నిషేధిత రసాయనాలతో తయారైన టపాసులు విక్రయిస్తే కేసులు పెట్టి, అరెస్టు చేస్తామన్నారు. బాణసంచా వంటి పేలుడు పదార్థాలు ఇళ్లలో నిల్వ ఉంచుకోవద్దని సూచించారు. టపాసుల దుకాణాల వద్ద నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని ఉంచుకోవాలన్నారు. జిల్లాలో టపాసుల అక్రమ విక్రయాలు, నిల్వలు, రవాణాపై డయల్ 112కు లేదా పోలీసు వాట్సాప్ నెంబరు 80999 99977 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. మందుగుండు సామగ్రి, తయారు చేసే ప్రాంతాలు, స్టోరేజి చేసిన గోడౌన్లు, అమ్మకాలు చేసే ప్రదేశాలపై ఇప్పటికే నిఘా ఉంచామన్నారు.

బాంబు బెదిరింపులపై దర్యాప్తు వేగవంతం

తిరుపతిలోని హోటళ్లు, రెండు ఆలయాలకు వరుస బాంబు బెదిరింపు మెయిల్స్ రావడంపై ప్రత్యేక సైబర్ టీం, ఐటీ, ఇతర విభాగాలతో దర్యాప్తు వేగవంతం చేశామని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. ప్రజలు, యాత్రికులు భయాందోళనకు గురికావాల్సిన పనిలేదన్నారు. తిరుపతి, తిరుమలలో భద్రత పెంచామన్నారు. నిరంతరం సీసీ టీవీ పర్యవేక్షణలో ప్రతి ఒక్కరి కదలికలను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. విదేశీయులను టార్గెట్‌గా చేసుకుని ఈ మెయిల్స్ వచ్చాయా అనే దానిపైనా విచారణ వేగవంతం చేశామన్నారు.

కాణిపాకం ఆలయ ప్రధాన అర్చకుడి సస్పెన్షన్



ఐరాల(కాణిపాకం),అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్‌ను సస్పెండ్ చేసినట్లు సోమవారం ఈవో గురుప్రసాద్ తెలిపారు. తన పదోన్నతి కోసం తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సమర్పించారంటూ సోమశేఖర్ గురుకుల్‌పై లాయర్ రవికుమార్ ఆరునెలల క్రితం దేవదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశీలించి నివేదిక అందించాలని అప్పటి ఈవో వెంకటేశును ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆయన ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలు తప్పుడు పత్రాలని తేలాయి. అయితే, సోమశేఖర్‌గురుకుల్‌కు అప్పటి ధర్మకర్తల మండలి అండ ఉండడంతో ఈవో ఏం చేయలేకపోయారు. దీనిపై లాయర్ రవికుమార్ కోర్టులో దావా వేశారు.ఈ నేపథ్యంలో ఈవోగా వచ్చిన గురుప్రసాద్ దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు నెల క్రితం ధ్రువీకరణ పత్రాలపై నివేదిక పంపించారు.దీంతో ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆలయ ఇన్‌చార్జి ప్రధాన అర్చకుడిగా ఎస్.ఎస్.గణేష్ గురుకుల్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.




పద్మనాభం కుటుంబం

శ్రమజీవన సౌందర్యం

పుత్తూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తెల్లవారకముందే ఆ అమ్మాయి పశువుల కొట్టంలోకి వెళ్తుంది. పేడ జవిరి కుప్ప పోస్తుంది. చీపురు అందుకుని ఊడవడం మొదలుపెడుతుంది. ఆ వెంటనే తమ్ముడు రంగంలోకి దిగుతాడు. పశువులన్నింటినీ కడిగి శుభ్రం చేస్తాడు. చిన్నతమ్ముడు పాల క్యాన్‌లతో అక్కా, అన్నలకి సాయంగా వస్తాడు. దానా వేసి, కగుడు నీళ్లు తాగించి, పాలు పితికి క్యాన్‌లు నింపుతారు. అక్క ప్రియదర్శిని ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్. సివిల్స్‌కి కోచింగ్ తీసుకుంటోంది. పెద్ద తమ్ముడు ఉమేష్ ఇంజనీరింగ్ ఫైనలియర్. చిన్నవాడు శశికిరణ్ నీట్‌కి ప్రిపేర్ అవుతున్నాడు. ఇన్‌స్టాలో రీల్స్ కోసం చేసిన ఫొటో షూట్ కాదు ఇది.. వారి దినచర్య. వ్యవసాయ కుటుంబాల్లో శ్రమకు ఉండే గౌరవానికి ప్రతీకగా కనిపిస్తుంది ఆ కుటుంబం. పుత్తూరులో నారాయణవనం రోడ్డులో వీరి నివాసం. నాన్న పద్మనాభానిది నారాయణవనం మండలం ఎరికంబట్టు. 60 సెంట్ల భూమి.. గంపెడు కుటుంబం.. రెక్కలు ముక్కలు చేసుకునేవారు. రెండు బర్రెలు పట్టుకుని భార్య ఆసరాగా నిలచింది. ఇంతలో అతనికి పోలీసు ఉద్యోగం వచ్చింది. పిల్లలు బాగా చవుకుని వృద్ధిలోకి రావాలనే కల నెరవేర్చుకోవడానికి పోలీసు జీతం ఎంత? రెక్కల కష్టాన్ని తమ పిల్లలకు కూడా వారసత్వంగా ఆ తండ్రీ, తల్లీ అందించారు. వారి మనసెరిగిన ఆ బిడ్డలూ తమ గుడ్డలు నలుగుతాయని వెరవలేదు. ఇంజనీరింగ్ చదువుతూ పేడ పనే మిటని సిగ్గు పడలేదు. స్నేహితుల ముందు అవమానం అని ఎన్నడూ అనుకోలేదు. చదువుకుంటూనే అన్ని పనులూ చేస్తున్నారు. ఇప్పుడు వారి దగ్గర 14 ఆవులు, నాలుగు బర్రెలు ఉన్నాయి. కాలేజీకి వెళ్లే ముందూ, వచ్చిన తర్వాత కూడా ఆ ముగ్గురు పిల్లలూ ఒళ్లు అలిసేలా శ్రమిస్తారు. కష్టం చేస్తూ కళకళలాడుతూ తిరిగే వీరిని చూసి 'దేవుడు దీవించి మావాడికి మంచి బిడ్డల్ని ఇచ్చాడు' అని పద్మనాభం తల్లిదండ్రులు ఆనందంగా చెప్పుకుంటారు.


వరద బాధితుల సహాయార్థం 'అపుస్మా' సాయం

- సీఎంకు రూ.65 లక్షల చెక్ అందజేసిన నాయకులు



తిరుపతి విద్య, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (అపుస్మా) 65 లక్షల రూపాయల విరాళాన్ని అందజేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల నుంచి విరాళాల ద్వారా అపుస్మా ఈ మొత్తాన్ని సమీకరించింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కార్యదర్శి కె.తులసి విష్ణు ప్రసాద్, రాయలసీమ జోన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి తదితరులు సోమవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి చెక్కును అందజేశారు. అపుస్మా కార్యవర్గాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జనార్దన్ రెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం రాస్ రూ.50 లక్షల విరాళం



తిరుపతి(ఆటోనగర్)అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో సీఎం చంద్రబాబుకు రూ.50 లక్షల చెక్కును అందజేశారు. రాస్ ద్వారా చేస్తున్న సామాజిక కార్యక్రమాలను వివరించారు. సీఎం మాట్లాడుతూ బాధితులను ఆదుకోవడానికి రాస్ చేసిన సాయం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 20 సూత్రాల పథకం మాజీ చైర్మన్ టీ.శేషసాయిబాబు, రాస్ సంయుక్త కార్యదర్శి ఎం.మమత, సూపరింటెండెంట్ వి.నాగరాజు పాల్గొన్నారు.

హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా సత్యవేడువాసి



చంద్ర ధనశేఖర్‌కు అభినందనలు తెలుపుతున్న ఎంపీపీ దంపతులు

సత్యవేడు, అక్టోబరు 28: రాష్ట్ర హైకోర్టులో సోమవారం ముగ్గురు అదనపు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ ముగ్గురిలో ఒకరు సత్యవేడుకు చెందిన ప్రముఖ న్యాయవాది తూటా చంద్ర ధనశేఖర్ అలియాస్ టీసీడీ శేఖర్. ఈయన చేత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ప్రతిమ సుశీల్‌కుమార్ రెడ్డితో పాటు పలువురు పట్టణ ప్రముఖులు హాజరై ఆయనకు అభినందనలు తెలిపారు. కాగా, చంద్రధనశేఖర్ 1988లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో నమోదయ్యారు. మాజీ అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాది పరాంకుశం వేణుగోపాల్ వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ చేశారు. ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులై వాణిజ్య పన్నుల శాఖ తరఫున వాదనలు వినిపిస్తున్నారు. సివిల్, క్రిమినల్, రెవెన్యూ, ట్యాక్స్, భూసేకరణ చట్టాలకు సంబంధించిన కేసులు వాదించడంలో ఆయన దిట్ట అని పేరు ఉంది. ఈయన తండ్రి తూటా చంద్రశేఖరన్ పట్టణంలో ప్రముఖ న్యాయవాదిగా కొనసాగుతున్నారు.

ఎస్వీయూకు ఎన్ఆర్ఐ రూ.10 లక్షల విరాళం

తల్లిదండ్రుల పేర సైకాలజీ క్లాస్ రూమ్ నిర్మించాలని లక్ష్మణరావు వితరణ



లక్ష్మణరావు నుంచి విరాళాన్ని స్వీకరిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూకు ఎన్ఆర్ఐ జేవీ లక్ష్మణరావు రూ.10 లక్షలు విరాళాన్ని అందించారు. యూనివర్సిటీ దూరవిద్యా విభాగం పరిధిలోని సైకాలజీ క్లాస్ రూమ్ నిర్మించాలని కోరారు. ఈ మొత్తానికి సంబంధించి చెక్కును వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు ఆయన అందజేశారు. రాజమండ్రికి చెందిన లక్ష్మణరావు ప్రస్తుతం చికాగోలో ఉంటున్నారు. యూనివర్సిటీ డీడీఈ సైకాలజీ పీజీ కోర్సు చదువుకున్నారు. గతంలో ఇండియా ట్రిబ్యూన్ పత్రిక ఎడిటర్‌గా పని చేశారు. ఈ క్రమంలో తన తల్లిదండ్రుల పేర యూనివర్సిటీ డీడీఈ సైకాలజీ క్లాస్ రూమ్ నిర్మించాలని దాత లక్ష్మణరావు కోరారు. ఈయన్ను అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, డీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ తవమణి, ఇంజనీర్ తాండవకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా, 87 ఏళ్ల వయసులో లక్ష్మణరావు యూనివర్సిటీ డీడీఈలో సైకాలజీ పీజీ చదవడం గమనార్హం.

గంజాయి కేసులో బీసీఏ విద్యార్థి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న బీసీఏ విద్యార్థిని సోమవారం తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి నుంచి 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చిన్నగోవిందు తెలిపారు. తాటితోపు రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు వెళ్లారన్నారు. పోలీసులను చూసి ఇద్దరు పరారవడానికి ప్రయత్నించగా.. బీసీఏ విద్యార్థిని పట్టుకున్నట్లు చెప్పారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఆర్టీసీ బస్సు - కారు ఢీ: మహిళకు గాయాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు - కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు... సోమవారం సూళ్లూరుపేట డిపో నుంచి వేనాడుకు వెళ్లే ఆర్టీసీ బస్సు జాతీయ రహదారిపై గోకులకృష్ణ కళాశాల మలుపు వద్ద మలుపు తిరిగే సమయంలో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మహిళ ఉషారాణికి స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు భాగం దెబ్బతింది. ఆర్టీసీ బస్సు డీజిల్ ట్యాంక్ పగిలిపోయింది. గాయపడిన ఉషారాణిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు

సూళ్లూరుపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మన్నారు పోలూరు వద్దనున్న 220 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో మార్పులు చేశామని ఈఈ శ్రీనివాసులు తెలిపారు. 220/132 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ ఫిల్టరేషన్ ప్రక్రియ అత్యవసరంగా చేపట్టాల్సి ఉన్నందున వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నామన్నారు. ఈ నెల 29 నుంచి నవంబరు 2వ తేదీ వరకు వ్యవసాయానికి రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా చేస్తామని, రైతులు ఈ మార్పును గమనించి సహకరించాలన్నారు.

టపాసుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

సూళ్లూరుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టపాసుల విక్రయాల్లో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. సోమవారం ఆమె డివిజన్ స్థాయి పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ మెడికల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. టపాసుల విక్రయాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. లైసెన్సు పొందిన వారు మాత్రమే టపాసుల విక్రయాలు జరపాలని స్పష్టం చేశారు. బాణసంచా దుకాణాల వద్ద నీరు, ఇసుక, అగ్నిమాపక సామగ్రి అందుబాటు ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో రవికుమార్, తహసీల్దార్ నరసింహరావు, సీఐ మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత

దొరవారిసత్రం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం తుంగమడుగు వద్ద కాళంగి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకొన్నారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నేత దయాకర్‌రెడ్డి, కొంత మంది గ్రామస్తులతో కలసి ట్రాక్టర్లను అడ్డుకొన్నారు.

కూలనుందా... కూల్చేస్తారా?

- ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పడగొట్టేందుకు సన్నాహాలు
- నేటి కౌన్సిల్ భేటీలో నిర్ణయం

సూళ్లూరుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణ దాహార్తి తీర్చేందుకు 2007లో రూ.11 కోట్లతో కోటపోలూరు చెరువులో సమ్మర్ స్టోరేజీ నిర్మించారు. అక్కడి నుంచి నీటిని పట్టణంలో ఓవర్ హెడ్ ట్యాంకులకు నింపి ప్రజలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకొన్నారు. ఇందులో భాగంగా 2008లో మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్‌లో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు. అయితే ఈ ట్యాంక్‌ను రెండేళ్ల నుంచి వినియోగించడంలేదు. ఆయా బోర్ల నుంచి నేరుగా కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉండగా నాలుగు రోజుల క్రితం ట్యాంకును కూల్చివేయాలని మున్సిపాలిటీ పాలకవర్గం నిర్ణయించింది. మంగళవారం జరగబోయే కౌన్సిల్ సమావేశ అజెండాలో సైతం ఈ అంశాన్ని చేర్చారు. ఇందుకోసం రూ.2.80లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.



సాయినగర్‌లోని ఓవర్ హెడ్ ట్యాంకు

ఎటువంటి తనిఖీలు లేకుండానే..

ఏదైనా ప్రభుత్వ భవనం శిథిలావస్థకు చేరినప్పుడు ఆర్‌అండ్‌బీ అధికారుల బృందం దానిని తనిఖీ చేయాలి. దానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సైతం ఆమోదం తెలిపారు. భవనం ప్రమాదకరమని నిర్ధారించి మున్సిపల్ అధికారులకు నివేదిక అందజేసిన తరువాత తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే సాయినగర్‌లో ఓవర్ హెడ్ ట్యాంక్ విషయంలో మాత్రం అటువంటి తనిఖీలు చేయలేదని తెలిసింది. కేవలం స్థానికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ఆసరాగా చేసుకొని ఈ ట్యాంకు కూల్చివేతకు మున్సిపల్ అధికారులు సమ్మతించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుత వాటర్ ట్యాంకులో లీకేజి తప్ప ఎటువంటి పగుళ్లు లేవని, పైగా ఇప్పటికిప్పుడు కూలిపోయే ప్రమాదం కూడా లేదని ఆ ట్యాంకును పరిశీలిస్తే అర్థమవుతుంది. బాగున్న ట్యాంకును హడావిడిగా కూల్చివేయాలని నిర్ణయించడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు ఎన్నో ఉండగా సాయినగర్ ట్యాంకునే పడగొట్టాలన్న నిర్ణయం అనుమానాలకు తావిస్తోంది. ట్యాంకు ఉన్న స్థలం అత్యంత విలువైనది కావడం, పక్కనే ప్రైవేట్ లే అవుట్‌లు ఉండడంతో ఆ స్థలాన్ని సొంతం చేసుకొనే ఆలోచనతో ఈ తతంగం జరుగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యను వివరణ కోరగా సాయినగర్ వాటర్ ట్యాంకు కూల్చివేయాలని కొందరూ అర్జీల ద్వారా వినతులు ఇచ్చారని, దీంతో ఈ అంశాన్ని కౌన్సిల్ సమావేశం అజెండాలో చేర్చామని తెలిపారు. పాలకవర్గం సభ్యుల నిర్ణయం మేరకు నిర్ణయం తీసుకొంటామని చెప్పారు.

అధికారులను బ్లాక్‌మెయిల్ చేయడం సరికాదు: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

డక్కిలి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో అధికారులను కొంతమంది బ్లాక్‌మెయిల్ చేస్తూ వారి విధులకు ఆటంకం కలిగించడం సరికాదని మాజీ జడ్పీటీసీ సభ్యులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులు పులి జనార్దనరెడ్డి, డక్కిలి చంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ కొంతమంది ప్రజా తమ సంఘాలకు చెందిన నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మీడియా సమావేశాలు పెట్టి ఎప్పటి విషయాలనో కొత్తగా జరిగినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి పాలన పారదర్శకంగా ఉందని, గత ప్రభుత్వంలో రెవెన్యూ శాఖలో జరిగిన అవకతవకలపై విచారించి రైతులకు న్యాయం చేయలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇచ్చారని వివరించారు. ఈ మేరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతున్నట్లు తెలియజేశారు. ఐదు సచివాలయాల్లో సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నట్లు కొందరు చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. అనంతరం తహసీల్దారు శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. నిజాయితీపరులైన అధికారులకు అండగా నిలుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముద్దా మునిస్వామిరెడ్డి, పోకూరు రమేష్, మునిరత్నం, మునికృష్ణయ్య, శివప్రసాద్, తిరుపతి పెంచలయ్య, దందోలు పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ పునర్నియామకంపై విచారణ



సీసీని విచారిస్తున్న విచారణాధికారి రాజాప్రతాప్

బాలాయపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి వెలుగు క్లస్టర్‌లో గతంలో అవినీతికి పాల్పడి నిధుల దుర్వినియోగం చేసిన సీసీ పునర్నియామకంపై రాష్ట్ర ఉన్నతి డైరెక్టర్ సీహెచ్ రాజాప్రతాప్ సోమవారం విచారణ చేపట్టారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఇన్‌చార్జి ఏపీఎం, సీసీలు, వీవోఏలు, మండల సమాఖ్య సభ్యులను విచారించారు. గతంలో బాలాయపల్లి క్లస్టర్‌లో పనిచేసిన సీసీ రూ.28 లక్షలు నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టారు. విచారణ ప్రక్రియ పూర్తి కాకుండానే తిరిగి ఇదే ప్రాంతంలో సీసీ విధుల్లో చేరడంతో సామాజిక కార్యకర్త చెన్నూరు మస్తాన్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విచారణాధికారి రాజా ప్రతాప్ మీడియాతో మాట్లాడుతూ నిధుల దుర్వినియోగం జరిగినట్లు ప్రాథమికంగా వివరాలు లభించాయన్నారు. విచారణ పూర్తి చేసి సమగ్ర నివేదికను సెర్ప్ సీఈవోకు అందజేస్తామన్నారు.

కోట ప్రభుత్వాస్పత్రిని 50 పడకల స్థాయికి పెంచుతాం: బీజేపీ

కోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోట ప్రభుత్వాస్పత్రి స్థాయిని 50 పడకలకు పెంచుతామని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కోమారి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం బీజేపీ నాయకులు ఆస్పత్రిని సందర్శించి పలు వార్డులు, ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కోట ప్రభుత్వాస్పత్రి కోట, వాకాడు, చిట్టమూరు మండలాలతో పాటు చిల్లకూరు మండలంలోని కొన్ని గ్రామాల రోగులకు సేవలు అందిస్తోందన్నారు. ప్రధానంగా సముద్రతీర ప్రాంత మండలాల్లోని ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ, మత్స్యకారులు ఇక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. అయితే ఆస్పత్రిలో సౌకర్యాల కొరత ఉందని, ఈ విషయాన్ని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆస్పత్రి స్థాయిని 50 పడకలకు పెంచుతామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.



వార్డులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కోస్టల్ లేబరేటరీ పరిశ్రమలో చోరీ

రూ.5.74 లక్షల నగదు అపహరణ

తడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోస్టల్ లేబరేటరీ పరిశ్రమ కార్యాలయ గది లాకర్‌లో ఉన్న నగదు చోరీకి గురైంది. మండల పరిధిలోని అక్కంపేట వద్ద ఉన్న కోస్టల్ లేబరేటరీ పరిశ్రమ ఖర్చుల నిమిత్తం రూ.6 లక్షల నగదును మేనేజర్ షేక్ కాలేషా శుక్రవారం బ్యాంక్ నుంచి డ్రా చేసుకొచ్చారు. శనివారం పరిశ్రమ క్యాషియర్‌కు రూ.లక్ష ఇచ్చి, మిగిలిన రూ.5 లక్షల నగదును తన ఆఫీసు టేబుల్ డ్రాయర్ పెట్టి తాళాలు వేసుకొని ఇంటికి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం ఆఫీసుకు రాగా, టేబుల్ డ్రాలో ఉండాల్సిన రూ.5 లక్షలు, క్యాషియర్ వద్ద ఉండాల్సిన రూ.74వేల నగదు చోరీకి గురైనట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ సభ్యత్వంతో బీమా సౌకర్యం

కోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా పార్టీ కార్యకర్తలకు బీమా సౌకర్యం లభిస్తుందని సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, ఆ పార్టీ సీనియర్ నాయకులు చిల్లకూరు దశరధరామిరెడ్డి, పాదర్తి కోటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పుచ్చలపల్లి, దొరువుకట్ట, ధైవాలదిబ్బ గ్రామాల్లో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగింది. టీడీపీ సభ్యత్వం వల్ల కలిగే ఉపయోగాలను ఇంటింటా వివరించారు. మొదటగా సీనియర్ టీడీపీ నేత చిల్లకూరు దశరధరామిరెడ్డితో పాటు ఆయన కుటుంబసభ్యులు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ శశి, ఆదిశేషయ్య, రవీంద్ర పాల్గొన్నారు.

పోలీసులకు వైద్య పరీక్షలు

వెంకటగిరిటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీసులు అమర వీరుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం 9వ బెటాలియన్‌లో తిరుపతిలోని రమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అడిషనల్ కమాండెంట్ అరుణ్‌బోస్ మాట్లాడుతూ పోలీసులు ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సత్కారం



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న గ్రామస్తులు

పెళ్లకూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రోసనూరు రాజుపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేసి పదవీ విరమణ పొందిన కొండూరు బాబు రాజేంద్రప్రసాద్‌ను సోమవారం గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, సిద్దులయ్య నాయుడు, సత్యంరాజు, మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో పెళ్లకూరు ప్రథమ స్థానంలో ఉండాలి

పెళ్లకూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో పెళ్లకూరు మండలాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలుపుదామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం కొత్తూరులోని పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. సిద్దులయ్యనాయుడు, కేవీ నాయుడు, మురళీ నాయుడు, మల్లిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, సుధీర్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

వెంకటగిరి టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు ఏడీఏ నాగర్జున సాగర్, గోవిందరాజులు సోమవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయలను చిన్నపిల్లలు, బాలికలు, మహిళలకు అందించటం ద్వారా పోషకాహార సమస్యలను నివారించవచ్చున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోషణ్ వాటిక కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీలకు కూరగాయల విత్తనాలు అందించారు. కార్యక్రమంలో విజయశ్రీ, తిరుపాల్, నాగార్జున రెడ్డి, రాజీవన తదితరులు పాల్గొన్నారు.

మేనకూరు వెల్‌నెస్ సెంటర్‌లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

నాయుడుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరులోని వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి హరిత ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది పనితీరు, గర్భిణులు, రోగుల అందుతున్న వైద్య సేవల ఆరోగ్య స్థితిగతులపై ఆరాతీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యుడు వికాస్, గణాంక అధికారి నాగేంద్రకుమార్, నరేష్‌బాబు, ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

సూళ్లూరుపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని సాయినగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో దుస్తులు, టపాసులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు చంద్రబాబు, సభ్యులు అలపాటి అశోక్ కుమార్, సాయిరామ్, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

సూళ్లూరుపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. సోమవారం పట్టణంలోని పార్కువీధికి చెందిన మేడా పిచ్చయ్య (68) మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో పిచ్చయ్య నేత్రాలను చెన్నై శంకర్ నేత్రాలయకు దానం చేశారు.

మహిళా క్రికెట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి



ఎంపీ కేశినేని చిన్నితో క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు

గూడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గూడూరులో మహిళా క్రికెట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కొణిదల మునిగిరీష్, మాజీ కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి కోరారు. సోమవారం విశాఖ పట్నంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో క్రికెట్ క్రీడాభివృద్ధికి చేపట్టవలసిన పలు అంశాలపై చర్చించారు. గూడూరులో మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకుడు జోగి శివకుమార్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు సాధారణంగా మరణించినా, ప్రమాదవశాత్తు మరణించినా ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలన్నారు. అలాగే కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పుట్టా శంకరయ్య, సురేష్, ప్రసాద్, పెంచలప్రసాద్, మురళి, అంకయ్య పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గూడూరు అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సైన్స్ చెకుముకి పోటీల్లో గూడూరు జీవీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆదివారం తిరుపతిలోని రిజనల్ సైన్స్ సెంటర్‌లో నిర్వహించిన సైన్స్ చెకుముకి పోటీల్లో గూడూరు జీవీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు భావన్య, వెంకటేష్, ఉదయ్‌కిరణ్ ప్రథమ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ

కోట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్లంపాడు పంచాయతీ కార్యాలయంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం అవకతవకలపై బహిరంగ విచారణ జరిగింది. ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడ్డారని స్థానికుడు కిషోర్ డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో వేణు, ఏపీడీ వరప్రసాద్, ఏపీవో పూర్ణిమ, పలువురు టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామంలో విచారణ జరిపారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదు

బాలాయపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారంటూ మండలంలోని సిద్దాగుంట గ్రామానికి చెందిన సర్పంచు భర్త రాఘవరెడ్డి సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. గతంలో వెంకటగిరి పట్టణం బంగారు పేటకు చెందిన కొందరు సిద్దాగుంటలో మేత పోరంబోకు భూమిని ఆక్రమించడంతో గ్రామస్తులు అడ్డుకోవడం జరిగిందన్నారు. అదే భూమిని ప్రస్తుతం బంగారు పేటకు చెందిన వ్యక్తులే ఆక్రమిస్తున్నారని, విచారణ జరిపి అడ్డుకోవాలని కోరారు. అలాగే మండలంలోని మన్నూరు గ్రామానికి చెందిన చీకటిపల్లి పోలయ్య తన భూమిని ఆక్రమించారని తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు.



జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం తిరుపతిలో ఎన్డీఏ కూటమి నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.